మంచిమాట

కోపం వచ్చినప్పుడు
నీ మనసుతో పోరాడు
మనిషితో కాదు..
సమస్య వచ్చినప్పుడు
కాలంతో పోరాడు
కన్నీరుతో కాదు..

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్



అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250




Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 131 విశాఖపట్నం, 26 ఫిబ్రవరి 2026 గురువారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00


## ప్రతిరోజూ పరీక్ష అన్నట్లు సిద్ధమవ్వాలి

- మంత్రులు, ఎమ్మెల్యేలూ పూర్తి పరిజ్ఞానంతో సభలో మాట్లాడాలి
- ఎలా మాట్లాడుతున్నారో ఏఐతో విశ్లేషిస్తాం మంత్రులతో సీఎం చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** ప్రతిరోజూ పరీక్ష అనే స్పృహతో మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో సన్నద్ధమై అసెంబ్లీకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏదైనా అంశాన్ని సభలో ఒకసారి సమర్థంగా ప్రజంట్ చేయగలిగితే అది ఏడాదిపాటు ఇంటింటికీ తిరిగి చెప్పేదానికి సమానంగా ఉంటుందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సభలో విషయాన్ని ఎంత ప్రభావవంతంగా ప్రస్తావిస్తున్నారు? వారి ప్రజంటేషన్ ఎలా ఉందనేదానిపై 'ఏఐ' ద్వారా విశ్లేషిస్తున్నామని చెప్పారు. బడ్జెట్ పద్దులపైనా మంత్రులు పూర్తిస్థాయిలో సన్నద్ధమై వచ్చి సభలో సమాధానాలివ్వాలన్నారు. ప్రతిపక్షం సభకు వచ్చి నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సింది పోయి.. బయట బాధ్యత లేని రాజకీయాలు చేస్తోందని సీఎం విమర్శించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రోజూ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఒక అంశంపై లఘుచర్చ చేపడదామని సీఎం సూచించారు. సంబంధిత శాఖ మంత్రి చర్చను లీడ్ చేస్తారని, కూటమి పార్టీల సభ్యులంతా భాగస్వాములై అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సందర్భాన్ని బట్టి తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్చలో పాల్గొంటామని మంత్రులకు సీఎం చెప్పారు.

### శ్రీకాకుళం, రాజమహేంద్రవరం ఘటనల్లో బాధ్యులపై కఠిన చర్యలు

శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీ పాల విక్రయం ఘటనలను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని సీఎం తెలిపారు. ఆ ఘటనలకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాఖలవారీగా జరుగుతున్న అభివృద్ధి, కార్యక్రమాలను ప్రజలకు తెలిపేలా సంబంధిత మంత్రులు పనిచేయాలని, కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ దస్త్రాలను త్వరితగతిన పరిష్కరించాలని నిర్దేశించారు.

### అదీ మన నిబద్ధత

ఈసారి ఒకటో తేదీ ఆదివారం వచ్చినందున, ముందురోజు శనివారమే (ఈ నెల 28) పింఛన్లు పంపిణీ చేయాలని సీఎం చెప్పారు. 'పింఛన్లు ఒక్కరోజు కూడా ఆలస్యం కాకుండా ఇస్తున్నాం. అదీ మన నిబద్ధత. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా మీ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీలో విధిగా పాల్గొనాలి' అని స్పష్టం చేశారు. దీంతో ఈ నెల 28న శాసనసభకు సెలవు ఇవ్వాలనే అంశం చర్చకు వచ్చింది. ఆరోజు శాసనసభలో కార్యకలాపాలు వద్దని తీర్మానించారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించి వైకాపా హయాంలో చేసిన అపచారంపై మంగళవారం శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో భావోద్వేగంగా మాట్లాడారని కొందరు మంత్రులు ప్రస్తావించారు. కొందరు మంత్రులు, సభ్యులు దీనిపై సన్నద్ధమై గురువారం శాసనమండలిలోనూ

⏭ తరువాయి 2లో..

## వెలిగొండ ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు చంద్రబాబు శంకుస్థాపన

**వెలిగొండ, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** మార్కాపురం జిల్లా వెలిగొండ ప్రాజెక్టులో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అనంతరం మార్కాపురం ప్రజా వేదిక సభకు హాజరయ్యారు. జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారి మార్కాపురం పర్యటనకు సీఎం వచ్చారు. ఈ నేపథ్యంలో హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, నిమ్మల రామానాయుడు తదితరులు ఘన స్వాగతం పలికారు. కొత్త జిల్లా ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మార్కాపురం జిల్లా ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.



## రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట: మంత్రి లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** కంపెనీల అవసరాలకు తగినట్లు చదువుకున్న యువతలో నైపుణ్యాలు పెంచి ఉద్యోగావకాశాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణపై శాసనసభలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, యార్లగడ్డ వెంకట్రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ మేరకు రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. క్లస్టర్ ఆధారంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని.. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో 22 క్లస్టర్లు ఏర్పాటుచేశామని వివరించారు.

తయారీ, సేవా రంగాలను గుర్తించి.. అందుకు ఉత్పత్తులు, ఉపకరణాలు, విడి భాగాలు ఒకేచోట తయారయ్యేలా ప్రణాళికలు రూపొందించామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఉద్యోగాల కల్పనకు సంబంధిత మంత్రులతో ఉప సంఘం ఏర్పాటుచేశామని.. సెక్టార్ల వారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గుర్తించి ఆ రంగంలో నైపుణ్యాభివృద్ధి కోసం చర్యలు చేపట్టామన్నారు. సాంకేతికత పెరిగిన సమయంలో బైక్, కార్ మెకానిక్‌లు కూడా కొత్త టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. నియోజకవర్గాలవారీగా ఇప్పటివరకూ 1500కు పైగా జాబ్ మేళాలు నిర్వహించి.. 1,08,747 మందికి ఉద్యోగాలిచ్చామని మంత్రి వివరించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ద్వారా 74వేల మందికి, కుల వృత్తుల్లో ఆధునికీకరణ కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ కార్యక్రమం ద్వారా 1,09,000 మందికి శిక్షణ ఇచ్చామన్నారు.

## హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు సంబంధం లేదు: లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** బాబాయ్‌ని చంపి కత్తి తమ చేతిలో పెట్టినట్లే.. వీఎస్ఆర్ ఏవియేషన్ విషయంలో వైకాపా ఆరోపణలు ఉన్నాయని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. మీడియా ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. "హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదు. హెరిటేజ్ ఫిన్ లీస్ అనేది 1996లో స్థాపించిన సంస్థ. అనేక ఇతర సంస్థల మాదిరిగానే 2022లో హెరిటేజ్ ఫిన్ లీస్ వద్ద వీఎస్ఆర్ ఏవియేషన్ ఫైనాన్స్ తీసుకుంది. ఆరోజు మేము అధికారంలోకి వస్తామని, మా ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని కలగన్నామా? అజిత్ పవార్ వీఎస్ఆర్ ఫ్లైట్ ఎక్కుతారని.. అది ప్రమాదానికి గురవుతుందని ఊహించామా?. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకు నేను ఎందుకు సమాధానం చెప్పాలి? క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం చెబుతాం. వీఎస్ఆర్ ఏవియేషన్ వ్యవహారంపై పూర్తి వివరాలు అందిస్తా" అని లోకేశ్ అన్నారు. చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగలను వదిలేస్తున్నారన్న బొత్స వ్యాఖ్యలపై కూడా లోకేశ్ స్పందించారు. జగన్ గజ దొంగ అని బొత్స చెబుతున్నారా.. జగన్‌ను పట్టుకోవాలని చెబుతున్నారా..? అని ప్రశ్నించారు.

### దానికి ప్రిన్సిపల్ చంద్రబాబు..

"ఎమ్మెల్యేలకు రెసిడెన్షియల్ క్లాసులు పెడతాం. రెండు రోజులపాటు వారంతా పార్టీ కార్యాలయంలోనే ఓరియెంటేషన్ క్లాసులో ఉండాలి. ఈ క్లాస్‌కు ప్రిన్సిపల్ సీఎం చంద్రబాబు.. మేమంతా విద్యార్థులమే" అని లోకేశ్ అన్నారు.

## శ్రీకాకుళంలో డయేరియా.. మున్సిపల్ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. నగరంలో డయేరియా ప్రబలడంతో ఒకరు మృతిచెందగా.. 76 మంది ఆస్పత్రి పాలయ్యారు. విధుల్లో కమిషనర్ కూర్మారావు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలింది. దమ్మలవీధి, గోల్కొండ రేవు, కాకివీధి, మంగువారితోట తదితర ప్రాంతాలకు చెందినవారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరారు. మరోవైపు ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో ఇంటింటా సర్వే నిర్వహించింది. వైద్యశిబిరాలు ఏర్పాటు




చేసి స్వల్ప లక్షణాలతో బాధపడుతున్న వారికి చికిత్స అందిస్తోంది. నగరపాలక సంస్థ సిబ్బంది ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేస్తున్నారు.

## అఖిలభారత పోలీసు సౌత్‌జోన్ టీ-20 విజేత పుదుచ్చేరి జట్టు

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** అఖిలభారత పోలీసు సౌత్‌జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పుదుచ్చేరి పోలీసు జట్టు నిలిచింది. అండమాన్-నికోబార్ దీవుల జట్టు రన్నరప్‌గా మిగిలింది. ఐదు రోజులుగా మూలపాడులోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మైదానంలో జరుగుతున్న ఈ టోర్నీలో వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, కేంద్ర భద్రతా బలగాలకు చెందిన 10 జట్లు పోటీపడ్డాయి. సెమీఫైనల్స్‌లో పుదుచ్చేరి పోలీసు జట్టు తమిళనాడును, అండమాన్-నికోబార్ పోలీసు జట్టు తెలంగాణను ఓడించి ఫైనల్స్‌కు చేరాయి. మంగళవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అండమాన్-నికోబార్ దీవుల జట్టుపై.. పుదుచ్చేరి 43 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 192 పరుగులు చేసింది. ఆ తర్వాత బరిలోకి దిగిన అండమాన్ జట్టు 18.3 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్ మైదానంలో సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పుదుచ్చేరి జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

## నెయ్యి కల్తీతో ప్రజావిశ్వాసంపై ప్రతికూల ప్రభావం

- తప్పిదాలపై తితిదేలో మొదలైన దిద్దుబాటు చర్యలు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటన



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అయిన వ్యవహారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) దిద్దుబాటు చర్యలు ప్రారంభించిందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెయ్యి కల్తీపై శాసనసభలో మంగళవారం స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయమై చర్చలో పాల్గొని వివరాలు వెల్లడించాల్సి రావడం బాధాకరమని చెప్పారు. ఘటన వెలుగులోకి వచ్చినప్పట్నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలపై 23 పాయింట్లతో రూపొందించిన ప్రకటనను సభలో చదివి వినిపించారు. అందులోని కీలకాంశాలు..

నెయ్యి సేకరణలో 2014-19 మధ్య ఎంతో కఠినంగా అమలుచేసిన నిబంధనలు 2020లో సడలించడంతో అక్రమాలకు అవకాశం ఏర్పడినట్లు విచారణలో వెల్లడైంది.

⏭ తరువాయి 2లో..

## ఏపీ వరుడు - సింగపూర్ వధువు

### చీరాలలో ఘనంగా వివాహం



**చీరాల, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** చీరాల ఆంధ్రప్రదేశ్ వరుడు, సింగపూర్ వధువుకు చీరాలలో ఘనంగా వివాహం జరిగింది. ప్రేమకు కులం, మతంతో పాటు దేశం కూడా అడ్డురాదని నిరూపిస్తూ.. బాపట్ల జిల్లా కంకటపాలేనికి చెందిన సాయి సూర్య, సింగపూర్ యువతి రోయని వేదమంత్రాల మధ్య ఏడడుగులు నడిచి ఒక్కటయ్యారు. పెళ్లి కూతురు తల్లిదండ్రులు, బంధువులు సైతం భారతీయ సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న సాయిసూర్యకు.. అదే కంపెనీలో పనిచేస్తున్న రోయనిల మధ్య స్నేహం ప్రేమగా మారింది. అనంతరం పెళ్లికి ఇద్దరూ.. ఇరువైపుల పెద్దలను ఒప్పించారు. వారి అంగీకారంతో చీరాలలో వైభవంగా పెళ్లి చేసుకున్నారు. విదేశీ యువతిని పెళ్లాడాలన్న నిర్ణయం సాయి సూర్య కుటుంబసభ్యులను తొలుత ఆశ్చర్యపరిచినా.. విశాల దృక్పథంతో అంగీకరించారు.

## పీఏసీఎస్ ఉద్యోగుల జీతాలు 20% పెంపు

- గ్రాట్యుటీ రూ.2లక్షల నుంచి రూ.4 లక్షలకు సంఘం నేతలతో మంత్రి అచ్చెన్నాయుడు, అధికారుల చర్చలు
- సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటన
- ఆందోళన విరమించిన ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగులకు 20% మేర జీతాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గ్రాట్యుటీ రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచనుంది. ప్రతి ఉద్యోగికి రూ.5లక్షల కవరేజీతో కూడిన సమగ్ర గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు పీఏసీఎస్ సంఘాల నేతలు

⏭ తరువాయి 2లో..

## పర్సనల్ టూర్ కోసం 50 మంది సిబ్బంది: BSNL డైరెక్టర్ తీరుపై కేంద్రం సీరియస్



**న్యూఢిల్లీ :** భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ వివేక్ బంజల్‌పై కేంద్రం సీరియస్ అయింది. తన ప్రయాగ్‌రాజ్ పర్యటన ఏర్పాట్ల కోసం చేసిన డిమాండ్లు వైరల్ కావడంతో అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తీవ్రంగా స్పందించారు. అధికారి ఇచ్చిన వివరణ ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**ఈ టూర్ వివాదం ఏంటంటే..?**

వివేక్ బంజల్ ప్రయాగ్‌రాజ్ పర్యటనకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ సమయంలో 21 పనులు చేసేందుకు 50 మంది బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని కేటాయించాలని డిప్యూటీ మేనేజర్ లెవెల్ ఆఫీస్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో ఆయన దిగగానే స్వాగతం పలకాలి. ఆలయ సందర్శనలు, బోట్ రైడ్స్‌ను సమన్వయం చేసుకోవాలి. టవల్స్, అండర్‌గార్మెంట్లు, నూనె, దువ్వెన వంటి వాటితో 'స్నాన' కిట్స్ సిద్ధం చేయాలి. మతపరమైన కార్యకలాపాల కోసం రవాణా సౌకర్యాలు చూసుకోవాలి. ఫొటోలు తీయాలి. అలాగే ప్రయాణం కోసం ఏర్పాటుచేసిన వాహనాల్లో వాటర్ బాటిల్స్, చాక్లెట్లు, స్నాక్స్ ఉండేలా చూడాలి.

ఈ విస్తృత సన్నాహాలకు సంబంధించిన ఆర్డర్ ఆన్‌లైన్‌లో వెలుగులోకి రావడంతో తీవ్ర వివాదమైంది. వనరుల దుర్వినియోగంపై నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారం కేంద్రం దృష్టికి చేరడంతో ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని బంజల్‌ను ఆదేశించింది. ఈ ప్రవర్తన నిబంధనల ఉల్లంఘన కిందికే వస్తుందని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

## రూ.30వేల లంచం.. తీగలాగితే అల్మారాలో నోట్ల కట్టలు..

**రాయగడ పట్టణం:** ఒడిశాలోని ఓ ప్రభుత్వ అధికారి ఇంట్లో నోట్ల కట్టలు లభించడం తీవ్ర కలకలం సృష్టించాయి. రూ.30వేల లంచం కేసులో తీగ లాగితే.. ఆ అధికారి అవినీతి వ్యవహారం బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఒడిశాలోని కటక్ సర్కిల్ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న దేబబ్రత మహంతిని అవినీతి కేసులో విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. లైసెన్స్ పొందిన ఓ బొగ్గు విక్రేత నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటూ ఆయన విజిలెన్స్ అధికారులకు చిక్కారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. బుధవారం ఉదయం మహంతి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఇందులో భారీ ఎత్తున లెక్కల్లో రాని నగదు బయటపడింది.

భువనేశ్వర్‌లోని ఆయన అపార్ట్‌మెంట్‌లో అల్మారాలో దాచిన రూ.4 కోట్లను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయన కార్యాలయంలోని టేబుల్‌లో మరో రూ.1.20 లక్షల నగదును గుర్తించారు. భువనేశ్వర్‌లో మరో రెండంతస్తుల భవనం, 130 గ్రాముల బంగారం గుర్తించినట్లు విజిలెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ స్థాయిలో నోట్ల కట్టలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అని సదరు వర్గాలు పేర్కొన్నాయి.

## ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి ఎక్కడా నిర్లక్ష్యం వద్దు: సీఎం చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్ :** ప్రజారోగ్యానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం, శ్రీకాకుళం ఘటనల్లో బాధితుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, ఆస్పత్రుల్లో అందుతున్న చికిత్స గురించి సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం ఘటనలో ప్రస్తుతానికి 76 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. పట్టణంలోని జెమ్స్ ఆస్పత్రిలో విషమంగా ఉన్న ఇద్దరు బాధితుల ఆరోగ్య పరిస్థితిపై సీఎం ఆరాతీశారు. ఒకరికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని.. మరొకరికి డయాలసిస్ చేస్తున్నామని అధికారులు చెప్పారు. చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇద్దరు మినహా అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరాను ఆపేసి.. ట్యాంకర్లతో సురక్షితమైన తాగునీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

రాజమహేంద్రవరం ఘటనలో బాధితులు నిరంతర వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని అధికారులు సీఎంకు చెప్పారు. పాల శాంపిళ్లను ఇప్పటికే ల్యాబ్‌కు పంపామని.. నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. శాఖాపరంగా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టామని అధికారులు వివరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# జగనన్న లేఔట్లలో రూ.7 వేల కోట్ల కుంభకోణం



నాటి అధికార పార్టీ నేతల భూదందా
పేదల ఇళ్ల నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం
మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 25 :** పేదలకు ఇళ్లస్థలాల పేరుతో వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న లేఔట్లలో రూ.7వేల కోట్ల కుంభకోణం జరిగిందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. నాటి అధికారపార్టీ నేతలు ప్రజల నుంచి తక్కువ ధరకు భూములు లాక్కొని, అంతకు రెండు, మూడు రెట్ల ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించారని తెలిపారు. జగనన్న లేఔట్ల ఏర్పాటుకు రూ.10,414 కోట్లు కేటాయించగా, అందులో సగానికిపైగా నిధులు దుర్వినియోగమైనట్లు మంత్రి స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో.. 'గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల మంజూరులో అవకతవకలు జరిగాయా' అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి అనగాని సమాధానమిచ్చారు.

**అనర్హులకు 7 లక్షలకుపైగా ప్లాట్లు**

'గత ప్రభుత్వం 31,35,320 దరఖాస్తులు రాగా, 22,80,358 మందికి స్థలాలు ఇచ్చారు. వారిలో 15 లక్షల మందే అర్హులు. మిగిలిన 7 లక్షలకుపైగా స్థలాలు వైకాపా నేతల బంధువులకు కట్టబెట్టారు. అధికారుల కమిటీ పరిశీలించి, ఇప్పటికే 43,948 మందిని అనర్హులుగా గుర్తించింది. మరో 1.11 లక్షల పట్టాలు పరిశీలనలో ఉన్నాయి. అనర్హులకు కేటాయించిన స్థలాలు రద్దుచేస్తాం' అని సత్యప్రసాద్ తెలిపారు.

**అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు**

'పేదలకు ఆవాసం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం ఇవ్వాలన్నది ప్రణాళిక. పట్టణాల్లో స్థలాల కొరత ఉన్నందున టిడ్కో, పట్టణ స్థానికసంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించాం. స్థలాల కోసం ప్రజల నుంచి 4 లక్షలకుపైగా దరఖాస్తులొచ్చాయి. 1.03 లక్షల మందిని అర్హులుగా గుర్తించాం. 1.41 లక్షల దరఖాస్తులు తిరస్కరించాం. మరో 1.56 లక్షల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి' అని మంత్రి వివరించారు.

## ప్రేమ విఫలమై.. యూట్యూబర్ కోమలి ఆత్మహత్య



**రాయదుర్గం(హైదరాబాద్):** ప్రేమ విఫలమై యూట్యూబర్ కోమలి (21) ఆత్మహత్యకు పాల్పడింది. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన కోమలి.. హైదరాబాద్‌లో బీఎస్సీ చదువుతోంది. మణికొండలోని చిత్రపురి కాలనీ ఎల్ఐజీలో బంధువుల వద్ద ఉంటోంది. విశాఖపట్నానికే చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, యూట్యూబర్ నిఖిల్ రెడ్డిని ఆమె ప్రేమిస్తోంది. కోమలి నుంచి దూరంగా ఉండేందుకు నిఖిల్ ప్రయత్నిస్తుండటంతో ఆరు నెలల క్రితం ఆమె ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు సర్దిచెప్పారు. ఇటీవల పెళ్లి విషయంలో కోమలి, నిఖిల్‌రెడ్డి గొడవపడ్డారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో కోమలి ఉరివేసుకుంది. ఆమె తల్లి మంగళవారం రాయదుర్గం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం

### NCERT పాఠంపై సుప్రీంకోర్టు సీరియస్

**న్యూఢిల్లీ :** నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) 8వ తరగతి పాఠ్యాంశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. " ఈ వ్యవహారం అందరినీ కలవరానికి గురిచేసింది. కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోం. చట్టం తన పని తాను చేసుకుపోతోంది" అని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా స్పందించారు. NCERT 8వ తరగతి విద్యార్థులకు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

## నెయ్యి కల్తీతో ప్రజావిశ్వాసంపై ప్రతికూల ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

అనుభవం, వార్షిక టర్నోవర్, ఆవుపాల కొవ్వు ఉత్పత్తి ప్రమాణాలు, తప్పనిసరి పాలసేకరణ నిబంధనలు తొలగించారు.

నెయ్యి ఉత్పత్తిలో అనుభవం లేని డెయిరీల ప్రవేశానికి నిబంధనల సడలింపు బాగా దోహదం చేసింది. భోలే బాబా ఓర్గానిక్ డెయిరీ మిల్క్, శ్రీవైష్ణవి డెయిరీ తదితర సంస్థలు ఇలాగే టెండర్లు దక్కించుకున్నాయి. 2024 మార్చి 12న తితిదే 10 లక్షల కిలోల ఆవునెయ్యి సరఫరా కోసం పిలిచిన ఈ-టెండర్‌ను ఏఆర్ డెయిరీ ఫుడ్ సంస్థ దక్కించుకుని కిలోకు రూ.319.80 చొప్పున సరఫరా చేసింది. ఆ ధరకు నిజమైన ఆవు నెయ్యి సరఫరా చేయడం అసాధ్యం.

సరఫరా చేసిన నెయ్యిపై అనుమానంతో నమూనాలు ఎన్‌డీడీబీ, సీఏఎల్ఎఫ్ ప్రయోగశాలకు పంపినపుడు నెయ్యిలో వనస్పతి, జంతువుల కొవ్వుతో కల్తీ జరిగినట్లు వెల్లడైంది. పామాయిల్, పామ్‌కెర్నల్ ఆయిల్, పామోలిన్‌తోపాటు బీటా-కెరోటిన్ ఇతర రసాయనాలు ఉపయోగించి అసలు నెయ్యి రుచి, సువాసన పోలి ఉండేలా కల్తీనెయ్యి తయారుచేసినట్లు విచారణలో తేలింది.

నెయ్యి సేకరణ, పరీక్షల కోసం ఎస్‌వోపీ ప్రవేశపెట్టాం. థర్డ్ పార్టీ సర్టిఫికేషన్, విజిలెన్స్ వ్యవస్థను తితిదే బలోపేతం చేస్తోంది.

సమగ్ర ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్ తయారీ, పునర్వ్యవస్థీకరణ, సాంకేతికత మూల్యాంకనంతో పాటు ఫైల్ ప్రాసెసింగ్ విధానాలు మెరుగుపరుస్తున్నాం. కీలకమైన సాంకేతిక పోస్టులు నిపుణులతో భర్తీ చేయనున్నాం.

తిరుమలతో ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రయోగశాల ఏర్పాటుతోపాటు తిరస్కరించిన సరకులు పారేయడం కోసం మెరుగైన యంత్రాల ఏర్పాటుకు తితిదే ఆమోదించింది.

టెండర్ నిబంధనల సడలింపులో సహకరించిన, నాణ్యత పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను గుర్తించి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

## పీఏసీఎస్ ఉద్యోగుల జీతాలు 20% పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో పీఏసీఎస్ సంఘాల నేతలతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఆర్‌సీఎస్ అహ్మద్‌బాబు, ఆప్కాబ్ ఎండీ రామకృష్ణ తదితరులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లపై చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, పెంచిన ప్రయోజనాల అమలును ఉన్నతస్థాయి కమిటీ త్వరలో ప్రకటిస్తుందని వివరించారు. పీఏసీఎస్ ఉద్యోగుల ఇతర డిమాండ్లను కూడా కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని చెప్పారు. పీఏసీఎస్ కంప్యూటరీకరణ, ఈఆర్‌పీలో రియల్‌టైమ్ లావాదేవీలు, డైనమిక్ ఈవోడీ ప్రక్రియలు, హెచ్ఆర్ఎంఎస్ ద్వారా జీతాల చెల్లింపు తదితర కీలక బాధ్యతల్ని ఉద్యోగులు నిబద్ధతతో నిర్వహిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఉద్యోగులు విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి సత్కరించారు.

## నన్ను క్షమించండి.. ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై బిల్‌గేట్స్

**అమెరికా:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన పత్రాల్లో తన పేరు ఉండడంపై మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ స్పందించారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉండడంపై ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పినట్లు తాజాగా వెల్లడైంది. తాను చట్టవిరుద్ధంగా ఏ పని చేయలేదని పేర్కొన్నారు. అయితే, ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. ఎప్‌స్టీన్ నేరాల్లో మాత్రం భాగస్వామ్యం కాలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' ఇంటర్వ్యూలో బిల్‌గేట్స్ ఈ అంశాలను పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ పేర్కొన్నట్లు తనకు ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్న మాట వాస్తవమేనని టౌన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గేట్స్ ఫౌండేషన్ సభ్యులతో బిల్‌గేట్స్ చెప్పారు. అయితే, వాళ్లు ఎప్‌స్టీన్ నేరాల్లో పాల్గొనలేదని స్పష్టం చేశారు. ఎప్‌స్టీన్‌తో భేటీ అనంతరం అతడి అసిస్టెంట్లు తనతో ఫొటోలు దిగారని, తాను వారిని ఎప్పుడూ కలవలేదని స్పష్టం చేశారు. అతడితో పలుమార్లు భేటీ కావడం, వీటికి గేట్స్ ఫౌండేషన్ సభ్యులను తీసుకురావడం చాలా పెద్ద తప్పేనని గేట్స్ విచారం వ్యక్తంచేశారు. తాను చేసిన తప్పిదానికి ఇందులో ఇరుక్కున్న వారికి క్షమాపణలు చెబుతున్నానని అన్నారు.

ఓ మైనర్‌పై వేధింపులకు సంబంధించిన కేసులో 2011లో ఎప్‌స్టీన్ దోషిగా తేలిన మూడేళ్ల తర్వాత అతడితో భేటీ అయ్యానని బిల్‌గేట్స్ వెల్లడించారు. అతడి నేపథ్యాన్ని సరిగ్గా తనిఖీ చేసుకోలేదన్నారు. ఈ విషయంపై మిలిందా గేట్స్ (మాజీ భార్య) ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ అతడితో పరిచయాన్ని కొనసాగించానని అన్నారు. అతడి విషయంలో మిలిందా ఎప్పుడూ సందేహాస్పదంగానే ఉండేదన్నారు. ఇదిలాఉంటే, ఎప్‌స్టీన్ ఫైల్స్ (జుజూర్వఅఅ టఅశ్రీవం) దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీలను అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## ప్రతిరోజూ పరీక్ష అన్నట్లు సిద్ధమవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావవంతంగా ప్రజంటేషన్ ఇవ్వాలని సీఎం సూచించారు.

మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలు

రిలయన్స్ కన్స్యూమర్స్ లిమిటెడ్, సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్, రేమండ్ గ్రూప్ ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్, జేకే మైని గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థలకు కేటాయించిన భూములకు సంబంధించి డబ్బు చెల్లింపు, ప్రాజెక్టుల గడువు పెంపు ప్రతిపాదనకు ఆమోదం. పల్నాడు జిల్లా కొండవీడు వద్ద 12.31 ఎకరాల్లో ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అర్షధాతు గ్రీన్ నానోటెక్నాలజీస్‌కి అనుమతి. రాధికా వెజిటబుల్ ఆయిల్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ చెందిన మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ అప్‌గ్రేడేషన్/ విస్తరణకు, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు గత ఏడాది సెప్టెంబరు 9న ఇచ్చిన ఉత్తర్వు సవరణకు, స్నేహా ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు గత ఏడాది ఏప్రిల్ 14న ఇచ్చిన ఉత్తర్వు సవరణకు, ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీ పొడిగింపునకు అనుమతి

హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, అజాద్ ఇండియా మొబిలిటీ, జిన్‌ఫ్రా ప్రెసిషన్స్, జూపిటర్ రెన్యువబుల్ సంస్థకు గతంలో చేసిన భూ కేటాయింపులు రద్దు చేస్తూ నిర్ణయం.

రామాయపట్నం రైలు కార్గో టెర్మినల్‌కు 153.77 ఎకరాలు

ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు నుంచి నేరుగా 153.77 ఎకరాల్ని రామాయపట్నం కార్గో రైల్ టెర్మినల్ (ఆర్‌సీఆర్‌టీ)కి బదిలీ చేసేందుకు అనుమతి.

నెల్లూరు జిల్లాలోని తెట్టు రైల్వేస్టేషన్ సమీపంలో మల్టీ కార్గో మాడ్యులర్ రైల్ టెర్మినల్ అభివృద్ధి చేస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,300 మందికి ఉపాధి లభిస్తుంది.

చిత్తూరు జిల్లా తవనంపల్లె మండలం పట్నం గ్రామంలోని 8.16 ఎకరాల భూమిని ఎకరానికి రూ.8.75 లక్షల చొప్పున మార్కెట్ విలువ చెల్లించే ప్రాతిపదికన కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి కేటాయింపు. దానిలో యాత్రికులకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తారు.

ఎన్‌హెచ్-216 నుంచి మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు అనుసంధాన రహదారి నిర్మాణానికి కృష్ణా జిల్లా నార్త్ మచిలీపట్నం మండలంలోని పోతేపల్లి గ్రామంలో 3.50 ఎకరాల భూమి ఏపీ మారిటైమ్ బోర్డుకు ఎకరం రూ.62.62 లక్షల చొప్పున కేటాయింపు.

శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని హాలుకూరులో వక్క మార్కెట్‌యార్డు ఏర్పాటుకు 10 ఎకరాల ప్రభుత్వ భూమి మార్కెటింగ్ శాఖకు కేటాయింపు. అక్కడ ఎకరం మార్కెట్ విలువ రూ.7.50 లక్షలు.

కర్నూలు జిల్లా లక్ష్మీపురం మండలంలోని కల్లూరులో అంతర్జాతీయ గురుకుల పాఠశాల ఏర్పాటుకు హైదరాబాద్‌కు చెందిన శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ సంస్థకు 10 ఎకరాల భూమి ఎకరం రూ.71.36 లక్షల చొప్పున కేటాయింపు.

బాపట్ల జిల్లా చీరాల మండలం కావూరివారిపాలెంలో 2.41 ఎకరాల భూమి ఏపీఐఐసీకి ఎకరం రూ.20 లక్షల చొప్పున కేటాయింపు.

పలు విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతి

అనంతపురం జిల్లా కణేకల్లు, డి.హీరేహాళ్, రాయదుర్గం మండలాల్లో 160 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సంస్థకు అనుమతి.

అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల్లో 160 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సంస్థకు అనుమతి.

కర్నూలు జిల్లా దేవనకొండ, కొండాపురం, ముత్తుకూరు మండలాల్లో 125 మెగావాట్ల పవన, సౌర హైబ్రిడ్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు.. రెన్యూ ఫొటోవోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి. దీనిలో భాగంగా 200 మెగావాట్స్ పర్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్ట్ ఏర్పాటుకి అనుమతి.

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామంలో 200 టీపీటీ కంప్రెస్డ్ బయోగ్యాస్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం.

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం బీచిగానిపల్లి గ్రామ పరిధిలో 200 మెగావాట్ల సోలార్ పవర్ పార్క్ ఏర్పాటుకు యశ్వ పవర్ ఎల్ఎల్‌పీకి అనుమతి.

కర్నూలు జిల్లా ఆలూరు, చిప్పగిరి, హొళగుంద, ఆత్మకూరు, నారాయణపూర్ మండలాల్లో ఎన్టీపీసీ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ 900 మెగావాట్‌ల సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు అనుమతి.

హోటళ్లు, రిసార్ట్‌లకు ప్రోత్సాహకాలు

రాజమహేంద్రవరంలో మెర్క్యూర్ బ్రాండ్ పేరు మీద ఫోర్‌స్టార్ హోటల్ ఏర్పాటుకు కంపాస్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనకు ఆమోదం.

రాజధాని అమరావతిలో 'మాలక్ష్మి వన్' పేరుతో ఇంటిగ్రేటెడ్ అల్ట్రా మెగా టూరిజం అండ్ హాస్పిటాలిటీ ప్రాజెక్టు ఏర్పాటుకు అకాసియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రోత్సాహకాలు.

విశాఖపట్నంలోని రుషికొండలో 'వి హోటల్' బ్రాండ్ పేరుతో త్రీస్టార్ హోటల్ ఏర్పాటుకు వీరాంజనేయ హాస్పిటాలిటీ సంస్థకు ప్రోత్సాహకాలు

చీరాల బీచ్‌లో ఫోర్ స్టార్ హోటల్ ఏర్పాటుకు అక్షయ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సంస్థకు ప్రోత్సాహకాలు

విశాఖపట్నంలోని రుషికొండలో వెస్టిన్ బ్రాండ్ కింద విలాసవంతమైన ఆతిథ్య ప్రాజెక్టు ఏర్పాటుకు రుషికొండ బీచ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రోత్సాహకాలు.

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరిలోని నందకోట వద్ద రిసార్ట్ కమ్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఎకో-ఐజిల్ రిసార్ట్స్ సంస్థకు ప్రోత్సాహకాలు.

'తిరుపతి వన్' పేరుతో ఇంటిగ్రేటెడ్ కల్చరల్ అండ్ మైస్ డెస్టినేషన్ ప్రాజెక్టు అభివృద్ధికి దివ్యశ్రీ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రోత్సాహకాలు.

విశాఖపట్నంలోని రుషికొండలో క్రౌన్ ప్లాజా బ్రాండ్ మీద కోస్టల్ హాస్పిటాలిటీ ప్రెసింక్ట్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేపీపీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు ప్రోత్సాహకాలు. కాకినాడలో ఫైవ్‌స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఎస్‌వీఎస్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు స్థలం కేటాయింపు, ప్రోత్సాహకాలు అందజేసేందుకు అనుమతి.

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో గనగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కొండ దిగువన భారీ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక కేంద్రం ఏర్పాటుకు ఇస్కాన్ సంస్థకు స్థలం, ప్రోత్సాహకాలకు ఆమోదం. 300 మెగావాట్‌ల విద్యుత్ తీసుకునేందుకు డిస్కమ్‌లకు అనుమతి

సెకీతో కుదిరిన విద్యుత్ విక్రయ ఒప్పందం ఆధారంగా 300 మెగావాట్ల విద్యుత్ తీసుకునేందుకు డిస్కమ్‌లకు అనుమతి.

ఏపీ ట్రాన్స్‌కోలో ఖాళీగా ఉన్న 67 ఏఈఈ/ఎలక్ట్రికల్ పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు అనుమతి.

ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ తీసుకున్న రూ.500 కోట్ల రుణానికి ప్రభుత్వం హామీ ఇచ్చే నిర్ణయానికి అనుమతి.

ఏపీ జల జీవన్ వాటర్ సప్లై కార్పొరేషన్, జలజీవన్ మిషన్ కార్యక్రమం అమలుకు నాబార్డ్ మంజూరు చేసిన రూ.650 కోట్ల రుణానికి ప్రభుత్వ హామీ ఇచ్చేందుకు అనుమతి. ఈ కార్పొరేషన్ల వనరుల సమీకరణ పరిమితిని రూ.12 వేల కోట్ల నుంచి రూ.14 వేల కోట్లకు పెంచారు.

# కల్తీ పాలను .. ఇలా గుర్తిద్దాం


నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు

**నర్సీపట్నం, విశాఖసమాచారం:** నర్సీపట్నం, రోజులు మారాయి. కాసులకు కక్కుర్తిపడి సంపూర్ణ ఆహారమైన పాలను కల్తీ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. చాలాచోట్ల ఈ కల్తీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇది ఇప్పుడు తీవ్రరూపం దాల్చి రాజమహేంద్రవరంలో అయిదు నిండుప్రాణాలను బలిగొంది. ముఖ్యంగా పిల్లలున్న ఇంట్లో పాల వాడకం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో తాగుతున్న పాలు సురక్షితమేనా అన్న ఒకింత సందేహం కలగక మానదు. పాలలో కల్తీ తెలుసుకోవడానికి సులువుగా మార్గం ఉందని.. ఇంటి వద్దే అందరూ ఈ పరీక్ష చేసే వీలుందని నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు చెబుతున్నారు. సాధారణంగా పాలలో నీటితోపాటు స్టార్చ్ (పిండి పదార్థం), డిటర్జెంట్ వంటి హానికారక పదార్థాలు కలుపుతున్నారు. ఇవి ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఒక్కోసారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. చిక్కగా కనిపించడానికి పిండిపదార్థం (స్టార్చ్), నురుగు బాగా రావడానికి డిటర్జెంట్‌ను ఉపయోగిస్తుంటారు. సింథటిక్ రసాయనాలతో ప్రొటీన్ శాతం పెరిగినట్లు చూపిస్తుంటారు.

**పరీక్షలు ఇలా..** వీటిని గుర్తించడానికి ఇంటిలోనే ఒక గాజు పలకపై ఒక చుక్క పాలు ఉంచితే అది వెంటనే జారిపోతే కల్తీగా గుర్తించవచ్చు. స్వచ్ఛమైనవి అయితే మందంగా జారుతూ తెల్లటి గీత ముద్రను విడిచిపెడుతుంది. రెండు మూడు చుక్కలు అయోడిన్ ద్రావణం వేశాక.. నీలం రంగులోకి మారితే అందులో స్టార్చ్ కలిసినట్లు గుర్తించాలి. సీసాలో పాలు పోసి దానిని బాగా కుదిపితే అధిక నురుగు వచ్చినట్లయితే డిటర్జెంట్ కలిపినట్లు గుర్తించవచ్చు. బాగా మరిగించినప్పుడు పాలు అసహజంగా గడ్డకడితే తేడా ఉన్నట్లు. అలా కాకుండా పై భాగంలో మీగడపొరలా ఏర్పడితే మంచివిగా నిర్ధారించవచ్చు. లాక్టోమీటరు పరీక్ష ద్వారా వీటి కచ్చితత్వాన్ని తెలుసుకోవచ్చు. విశ్వసనీయమైన డెయిరీ సంస్థలు.. సీలు చేసిన ప్యాకెట్లను మాత్రమే వినియోగిస్తే మేలని ఏడీ పేర్కొన్నారు

# జిల్లాలో పెరుగుతున్న బీపీ బాధితులు



**నర్సీపట్నం, విశాఖసమాచారం:** జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారిలో రక్తపోటు బాధితులు పెరుగుతున్నారు. ఆర్థిక సంబంధ వ్యవహారాలను చక్కదిద్దే వారిలో చాలా మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నా.. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. బీపీ లెక్కలనూ ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. ఇది తీవ్రమైతే ప్రాణాలకే ముప్పుగా పరిణమిస్తుంది. ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ప్రభుత్వం చేపట్టిన ఎన్‌సీడీ సర్వేలో జిల్లాలో అధికమవుతున్న బీపీ బాధితుల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకు నిర్వహించిన సర్వేలో 1,71,502 మంది రక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది. సాధారణంగా 50 ఏళ్లు దాటిన తర్వాతే బీపీ వస్తుందని భావిస్తుంటారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో ప్రస్తుతం అన్ని వయసుల వారిలో రక్తపోటు బాధితులు ఉంటున్నారు. జిల్లాలో ఇప్పటికి మూడు దశల్లో నిర్వహించిన సర్వేలో 5,41,158 మందిని ఆరోగ్య సిబ్బంది పరీక్షించారని ఎన్‌సీడీ పీఓ ఏస్తేరురాణి చెబుతున్నారు. 1,71,502 మందిలో బీపీ అధికంగా ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న మూడో దశ ఎన్‌సీడీ 4.0 సర్వేలో కొత్తగా 2,531 మంది రక్తపోటు బాధితులను గుర్తించారు. 21,080 మంది అనుమానితులు ఉన్నట్లు అంచనా. ఎంఎంహెచ్‌జీ పేరిట బీపీ హెచ్చుతగ్గులను లెక్కిస్తుంటారు. 120/80 కంటే తక్కువగా ఉంటే సాధారణం. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకుంటే నియంత్రణలో ఉంచుకోవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి. మద్యం, పొగతాగడం మానేయాలి. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించుకోవడంతోపాటు మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చూసుకోవాలి. ఉప్పు వినియోగం బాగా తగ్గించాలి. ఎక్కువగా పండ్లు, కూరగాయలు, గింజలు, పప్పులు ఆహారంగా తీసుకోవాలి. మాంసాహారులు చికెన్, చేపలు, వెన్న తీసిన పాలు ఆహారంగా తీసుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

# సచివాలయ ఉద్యోగినంటూ మోసం ఒకరి అరెస్టు



**అనకాపల్లి, విశాఖసమాచారం:** అనకాపల్లి పట్టణం, సచివాలయం ఉద్యోగినంటూ మోసంచేసి.. నగలు కాజేసిన వ్యక్తిని పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం డీఎస్పీ శ్రావణి వివరాలు వెల్లడించారు. విశాఖపట్నంలోని పీఎం పాలెంకి చెందిన ఎల్లమెల్లి వెంకట రమణ గత ఏడాది డిసెంబరులో అనకాపల్లి కరణాల వీధిలో ఇల్లు అద్దెకు కావాలని వచ్చాడు. తాను సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్నానని.. పింఛను ఇప్పిస్తానని ఇంటి యజమానురాలైన మహిళను నమ్మించాడు. ఫొటో తీయడానికి బంగారు వస్తువులు మెడలో నుంచి తీసేయాలని చెప్పి వీటిని కాజేశాడు. ఎస్ రాయవరం మండలం కొరుప్రోలులో కూడా సచివాలయం ఉద్యోగినంటూ కొత్త పథకం కింద డబ్బులు వచ్చాయని మహిళను నమ్మించాడు. ఆధార్‌కార్డు, ఫొటో కావాలని చెప్పి ఫొటో తీయడానికి బంగారు వస్తువులను తీసేయాలని చెప్పి వీటిని కాజేశాడు. ఇలా రెండు చోట్ల 87.70 గ్రాముల బంగారు వస్తువులను కాజేశాడు నిందితుడు వెంకట రమణను మంగళవారం అనకాపల్లిలో కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. 1998 నుంచి ఈ తరహా మోసానికి పాల్పడుతున్న ఘటనల్లో ఇతనిపై 42 కేసులు నమోదయ్యాయి. పలుమార్లు జైలు శిక్ష కూడా అనుభవించాడు. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సైలు సంతోష్‌కుమార్, అల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ర్యాంపు కానరాదు.. చక్రాల కుర్చీ ఊసేలేదు

**అనకాపల్లి, విశాఖసమాచారం:** రావికమతం, ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద దివ్యాంగ విద్యార్థుల కోసం ర్యాంపు, వీల్‌ఛైర్ వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాల్సి. కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అలాంటివి లేకపోవడంతో దివ్యాంగ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు తప్ప ఇతరులను అనుమతించేందుకు వీలులేకపోవడంతో ద్వితీయ ఇంటర్ పరీక్ష రాసేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లేందుకు హైరానా పడ్డారు. తోటకూరపాలెంకు చెందిన గూనూరు ఆదిలక్ష్మి మరుపాక ఏపీ మోడల్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతోంది. ఈమెకు రెండు కాళ్లు పనిచేయవు. సహాయకులు లేనిదే నడవలేదు. కూర్చుంటే లేవలేని పరిస్థితి. ఈమె తల్లి వెంకటలక్ష్మితో కలిసి స్కూటీపై తోటకూరపాలెం నుంచి సుమారు 20 కి.మీ. దూరం నుంచి కొత్తకోట పరీక్ష కేంద్రానికి వచ్చింది. ప్రధాన గేటు నుంచి కళాశాల భవనం వరకు చాలా దూరం నడిచి రావాల్సి ఉంటుంది. నడవలేని పరిస్థితిలో ఉన్న ఆదిలక్ష్మిని ఆమె తల్లి వెంకటలక్ష్మి ఎత్తుకొని కళాశాల వరకు తీసుకొచ్చింది. అక్కడి నుంచి పరీక్షహాల్లోకి వెళ్లేందుకు మెట్లు ఎక్కాల్సి రావడంతో ఆమె ఇబ్బంది పడింది.



వీల్‌ఛైర్ సదుపాయం కల్పించని తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గ్రామీణుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాఖపట్నం, టొయోటు రేర్ ఎర్త్ ఇండియా లిమిటెడ్ (టీఆర్ఇఐ) ఆర్థిక సహకారంతో ఇవ్వనున్న ఉచిత వసతి, శిక్షణ, ఉపాధి అవకాశాలకు గ్రామీణ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెమ్స్ సీవోవో కమాండర్ (ఆర్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ దరఖాస్తులను ఫిబ్రవరి 28వ తేదీలోగా పంపాలని పేర్కొన్నారు. సంబంధిత కోర్సుల్లో రెండు నెలల శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సింధియా దరి సెమ్స్ కార్యాలయంలోగాని, 7794840934, 8331901237, 0891-2704010 నెంబర్లలోగాని సంప్రదించాలన్నారు.

# మట్టి అక్రమంగా తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి రేగు





**సాలూరు విశాఖ సమాచారం :** సాలూరు ప్రాంతంలో ప్రభుత్వము నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని జనసేన పార్టీ సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ రేగు మహేశ్వరరావు ఆర్పిఐ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రావు ఒక ప్రకటనలో తెలిపారు కూటమి నాయకులు దర్జాగా సాలూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో రైతులు పొలాల దగ్గర నుండి తాసిల్దార్ అనుమతులు లేకుండా దర్జాగా జాతీయ రహదారిపై లారీలతో మట్టిని తరలించి రైల్వే స్టేషన్ సమీపంలో లేఅవుట్స్ కోసం మెట్టిరోడ్లో నిర్మాణం చేస్తున్నారు అని మహేశ్వరరావు తెలిపారు దర్జాగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉందని కొంతమంది నాయకులు రెవిన్యూ అధికారులు అండదండలతో వ్యాపారం చేస్తూ లాభాలు అర్జిస్తూ ఉన్నారు జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ మట్టి తవ్వకాలు జరిపిన పారుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్.పి.ఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశరావు తెలిపారు అధికారులు స్పందించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన నం. eT-West-WAT-02-2026, తేది: 18.02.2026కు

**సవరణ నం.1**

పై టెండరు ప్రకటనకు ఎదురుగా దిగువ సవరణలు చేయబడినవని గమనించగలరు. అవి క్రింది విధముగా ఉన్నవి.

| ప్రస్తుత ప్రకటిత టెండరు విలువ | సవరించబడిన ప్రకటిత టెండరు విలువ |
|---|---|
| ₹ 5,17,65,744.81 | ₹ 5,17,65,571.19 |

వివరాల కొరకు కాగోరు టెండరుదారు(లు) వెబ్‌సైట్: www.ireps.gov.in దర్శించ వలసిందిగా సూచించడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (Engg)/ వాల్తేరు

PR-1169/Q/25-26


# రాష్ట్ర వ్యాప్తంగా ఐదు సర్క్యులర్ ఎకానమీ పార్కులు




**నర్సీపట్నం, విశాఖసమాచారం:** మద్దిలపాలెం, రాష్ట్ర వ్యాప్తంగా ఐదు సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. విశాఖ బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి-సీఐఐ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో 'సర్క్యులర్ ఎకానమీ అండ్ గ్రీన్ కంపెనీస్' అంశంపై మంగళవారం కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'చెత్త నుంచి సంపద సృష్టించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. త్వరలో విజయవాడలో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేస్తాం. 107 వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం. సర్క్యులర్ ఎకానమీ భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారనుంది. 2050నాటికి దేశంలో ఈ ఎకానమీ విలువ సుమారు 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. మేకపాలతో తయారు చేసిన సబ్బులను ప్రదర్శిస్తున్న ఓ సంస్థ ఉద్యోగిని తద్వారా 10 మిలియన్లకు పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయి. దేశంలోనే తొలిసారిగా సమగ్ర సర్క్యులర్ ఎకానమీ పాలసీ, మార్గదర్శకాలను విడుదల చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదే. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి, సాంకేతిక ఆధారిత పరిపాలనతో ఈ వినూత్న పాలసీ రూపుదిద్దుకుంది. విశాఖపట్నం, గుంటూరులో రోజుకు 100 టన్నుల సామర్థ్యం గల జంతు వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నాం. రాష్ట్రంలో రోజుకు 1300 నుంచి 1400 టన్నుల పౌల్ట్రీ వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. వాటిని శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు విలువైన ఉప ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలు ఉన్నాయి. విజయవాడలో ఏర్పాటు చేయనున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా శిక్షణ, పరిశోధన, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.' అని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. బీ ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, పరిశ్రమలశాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎన్.యువరాజ్, సీఐఐ విజయవాడ ఛాప్టర్ పూర్వ ఛైర్మన్ వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



మేకపాలతో తయారు చేసిన సబ్బులను ప్రదర్శిస్తున్న ఓ సంస్థ ఉద్యోగిని

# ముగిసిన హౌస్ సర్జన్ల గడువు కేజీహెచ్‌పై తీవ్ర ప్రభావం

**వన్‌టౌన్, విశాఖసమాచారం:** వన్‌టౌన్, : కింగ్ జార్జ్ ఆసుపత్రి(కేజీహెచ్)లో వైద్య సేవలకు అంతరాయం కలిగే పరిస్థితి తలెత్తింది. ఏడాది నుంచి విధులు నిర్వహిస్తున్న దాదాపు 200 మంది హౌస్‌సర్జన్ల గడువు మంగళవారంతో ముగిసింది. కొత్త వాళ్లు (బ్యాచ్) రావడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. అప్పటివరకు వైద్య సేవలపై ప్రభావం పడుతుంది.

**ఏటా 250 మంది..!**

ఏటా ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసిన 250 మంది ఏడాది పాటు హౌస్‌సర్జన్లుగా సేవలు అందిస్తారు. గత ఏడాది వచ్చిన వారి గడువు పూర్తవడంతో, వారంతా బయటకు వెళ్లిపోనున్నారు. కొత్త బ్యాచ్‌కు ఏప్రిల్ నెలలో థియరీ పరీక్షలు, ఆ తర్వాత ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ఇవన్నీ పూర్తయ్యాక తుది ఫలితాలను ఎన్టీఆర్ విశ్వ విద్యాలయం ప్రకటిస్తుంది. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని హౌస్‌సర్జన్లుగా నియమిస్తారు. వారంతా కేజీహెచ్‌తో పాటు ఏఎంసీకి అనుబంధంగా నగరంలో ఉన్న ఏడు ఆసుపత్రుల్లో సేవలు అందించాల్సి ఉంటుంది. ఎక్కువ మంది కేజీహెచ్‌లోనే విధులు నిర్వహిస్తుంటారు. రోజూ కేజీహెచ్ క్యాజువాల్టీలోని మూడు షిఫ్టుల్లో, వివిధ వార్డుల్లో, రక్త సేకరణ కేంద్రంలో, రక్తనమూనాల సేకరణ, తదితర విభాగాల్లో హౌస్‌సర్జన్ల సేవలు కీలకం. ఇప్పుడు ఆయా పనులు చేయడానికి పీజీలు ససేమిరా అంటున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేలా ఆసుపత్రి వైద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

**ముందుచూపు ఏది..?**

ఈ సమస్యను ఎలా అధిగమించాలనే విషయమై ఆసుపత్రి వైద్యాధికారులు ముందస్తుగా దృష్టి సారించలేదు. హౌస్‌సర్జన్లు అందించే సేవల్ని పీజీ(పోస్టు గ్రాడ్యుయేట్)లు చేయాలని వైద్యాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో, పనిభారం పెరుగుతుందని పీజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం విదేశాల్లో చదువుకుని కేజీహెచ్‌లో శిక్షణ పొందుతున్న 16 మందిని హౌస్‌సర్జన్ల స్థానంలో నియమించారు. సుమారు 200 మంది అందించే సేవల్ని 16 మందితో ఎలా చేయించాలని వైద్యులు తలలు పట్టుకుంటున్నారు.

# అనధికార మార్గాల మూసివేత

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నక్కపల్లి, జాతీయ రహదారిపై నక్కపల్లి మండల పరిధిలో పలు అనధికార మార్గాలను మూసివేస్తున్నారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలపై 'ఈనాడు'లో వస్తున్న కథనాలపై పోలీసు ఉన్నతాధికారులు, హైవే నిర్వహణ సంస్థ ప్రతినిధులు స్పందించారు. నక్కపల్లి మండల పరిధిలో పరిస్థితిపై సీఐ జె.మురళి దృష్టి సారించారు. సారిపల్లిపాలెం, నక్కపల్లి, ఉద్దండపురం తదితర ప్రాంతాల్లో అక్రమంగా రోడ్డు దాటుతున్న ప్రాంతాలను గుర్తించారు. హైవే ప్రతినిధుల ద్వారా భారీ సిమెంట్ పలకలు రప్పించి ఆయా మార్గాలకు అడ్డుగా పెడుతున్నారు. మిగిలిన చోట్ల పూర్తిగా గుర్తించి పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామన్నారు. ఎస్పీ పర్యవేక్షిస్తున్నారని వివరించారు.




# 16వ నంబరు జాతీయ రహదారిపై క్యూఆర్ కోడ్ బోర్డులు




**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ప్రభుత్వం చేపడుతున్న రహదారి నిర్మాణాల్లో పారదర్శకత పెంచడంతోపాటు వీటిలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు జాతీయ రహదారి వెంబడి పట్టణ ప్రాంతాల వద్ద క్యూఆర్ కోడ్ పలకలు ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి పనులు, ఇతర విషయాలు తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతాయి. ఆంగ్లం, తెలుగు, హిందీ, ఒడియాతో పాటు 23 ప్రాంతీయ, జాతీయ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుంది. దీని గురించి తెలుసుకుందాం రండి.. జాతీయ రహదారి వెంబడి ప్రయాణించే వారికి రోడ్డు పక్కన అక్కడక్కడ క్యూఆర్ కోడ్‌తో ఉన్న నీలం బోర్డులు కనిపిస్తుంటాయి. వాటిని చరవాణితో స్కాన్ చేస్తే ప్రాజెక్టుల వివరాల పూర్తి సమాచారం తెరపై కనిపిస్తుంది. రహదారి నిర్మాణం, దానికైన ఖర్చు, గుత్తేదారు వివరాలు, సమీపంలో ఉండే పట్టణం, రోడ్డు నిర్వహణాధికారి పేరు, ఫోన్ నంబరు తెలుస్తాయి. సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా, వాటి మేనేజర్ల పేర్లు, వివరాలు, వాటి సమీపంలో ఉండే సదుపాయాలు, వైద్యసేవలు, ఛార్జింగ్ పాయింట్లు, మరుగుదొడ్లు, పోలీసుస్టేషన్, దాని అధికారి పేరు, వాహనాలు నిలిపే స్థలం, వాహన మరమ్మతు కేంద్రాలు, టైర్లలో గాలి తనిఖీ కేంద్రాలు, అత్యవసర విభాగాధికారులు, వారి పేర్లు, ఆసుపత్రులు, వైద్యులు, ఫోన్ నంబర్లు, దేవాలయాలు, హోటళ్లు, విశ్రాంతి కేంద్రాలు.. ఇలాంటి వివరాలు క్యూఆర్ కోడ్‌లో నిక్షిప్తం చేశారు. ప్రాజెక్టులో తేడాలున్నా, సేవాలోపాలు కనిపించినా నేరుగా సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

# మనసు పరవశించే.. తనువు పులకించే



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** చీపురుపల్లి, రాజాం పట్టణం, శంబర(మక్కువ), న్యూస్‌టుడే: చీపురుపల్లి కనకమహాలక్ష్మి, రాజాం పోలిపల్లి పైడితల్లి జాతరలో మంగళవారం చివరి రోజు భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఘటోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శంబర పోలమాంబ అమ్మవారి అయిదోవారం జాతర భక్తిశ్రద్ధల మధ్య సాగింది.

**జామి ఎల్లారమ్మ జాతర:** జామి ఎల్లారమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి తల్లిని ఆవహించిన పూజారులు గద్దె నుంచి బయలుదేరారు. జముకుల పాటలతో ఊరేగించారు. మంగళవారం జాతరకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 200 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

**ఎల్లమ్మ సిరిమానోత్సవం:** విజయనగరం కంటోన్మెంట్, గంట్యాడ గ్రామీణం: విజయనగరం సంగీత కళాశాల ప్రాంతంలో ఎల్లమ్మ తల్లి సిరిమానోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. సాయంత్రం సిరుల ఉత్సవం చేపట్టారు. పూజారి త్రినాథ్ తేజ సిరులు ఎక్కే కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తదితరులు తల్లిని దర్శించుకున్నారు. బుడతనాపల్లి ఎల్లారమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో బి.రాజేరు నుంచి చినమానాపురం కూడలి వరకు జనసంద్రంగా మారింది. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# సాయానికి వెళ్తే ప్రాణం పోయింది

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** అయ్యన్నపేట, పక్కింటి వాళ్లు గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ పెట్టమంటే సాయానికి వెళ్లిన ఓ వివాహితను మృత్యువు వెంటాడింది. రెగ్యులేటర్ సరిగా లేక గ్యాస్ సిలిండర్ నుంచి చెలరేగిన మంటల్లో చిక్కుకున్న ఆమె మృతిచెందారు. ఈ విషాదకర ఘటన విజయనగరంలో మంగళవారం చోటుచేసుకుంది. నగరానికి చెందిన భవానీ(31)కి విజయవాడ వాసి ప్రభువుతో వివాహమైంది. పిల్లలు శ్యామ్, సంజయ్‌తో కలిసి స్థానికంగా ఉన్న హుకుంపేట సాయిబుల కాలనీలో నివాసం ఉంటున్నారు. మధ్యాహ్నం పక్కింట్లో ఉన్న ఫాతిమా అనే మహిళ గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను అమర్చడానికి పిలిచారు. సరిగా బిగించకపోవడంతో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. తన ప్రాణాలను కాపాడుకునేందుకు భవానీ వంట గదిలో ఓ మూలకు వెళ్లి అక్కడే ఇరుక్కుపోవడంతో కాలిపోయారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేసరికే ప్రాణాలు కోల్పోయారు. భర్త కళ్లెదుటే పిల్లలు 4, 5 తరగతులు చదువుతున్నారు. ఉదయం లేచి పాఠశాలకు వెళ్లిపోయారు. ప్రభువు ఇంటి వద్దే ఉన్నాడు. మంటలు రావడం, కేకలు వినిపించడంతో ఒక్కసారిగా పరుగు తీశాడు. .. . తన కళ్లెదుటే భార్య ప్రాణాలు కోల్పోవడంతో కన్నీరుమున్నీరయ్యాడు. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన చిన్నారులు అమ్మ ఏదని అడగ్గా.. అక్కడున్నవారంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు



# మెదడులో కణితి కలవరం

కణితి పేరు వింటేనే బెంబేలెత్తుతాం. అలాంటిది శరీరం మొత్తానికి హెడ్‌మాస్టర్‌లాంటి మెదడులో కణితి (బ్రెయిన్ ట్యూమర్) ఉందంటే చెప్పేదేముంది? నిలువెల్లా భయంతో వణికిపోతాం. అది క్యాన్సరేమో, ఎక్కడికి దారి తీస్తుందోననే ఆందోళన మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. నిజానికి మెదడులో తలెత్తేవన్నీ క్యాన్సర్ కణితులు కావు. దాదాపు సగం వరకూ మామూలువే. అన్నింటికీ శస్త్రచికిత్స అవసరం లేదు. చిన్న, మామూలు కణితులను ఒకరోజు చికిత్సతోనూ నయం చేయొచ్చు. క్యాన్సర్ కణితులకు ఇప్పుడు మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మరెన్నో అధునాతన చికిత్సలూ పురుడు పోసుకుంటున్నాయి. మన మెదడు ఓ సజీవ కంప్యూటర్. కేంద్ర నాడీవ్యవస్థలో ఒక భాగమైన ఇది జ్ఞానేంద్రియాల నుంచి సమాచారాన్ని సంగ్రహించి అవయవాలకు, కండరాలకు ఆదేశాలు జారీచేస్తుంది. ఇలా ఒంట్లో అన్ని పనులను పురమాయిస్తుంది, పర్యవేక్షిస్తుంది. మెదడులోని కణాల ఆకృతి, పనితీరు వేరుగా ఉన్నప్పటికీ అవన్నీ జన్యుపదార్థమైన డీఎన్ఏ ఆదేశాల మేరకు నడచుకుంటాయి. ఎందుకనో కొన్నిసార్లు ఈ జన్యు పదార్థంలో మార్పులు లేదా తప్పులు సంభవించి కణాల పనితీరు అస్తవ్యస్తమవుతుంది. అసాధారణంగా పెరుగుతూ, విభజన చెందుతూ వచ్చి ఒకచోట గూడుకట్టుకొని, కణితుల్లా ఏర్పడతాయి. ఇవి తాము చేయాల్సిన అసలు పనిని 'మరచిపోవటం'తో పాటు చుట్టుపక్కల కణాల పనితీరునూ భంగపరుస్తుంటాయి. సమీపంలోని మెదడు భాగం మీద ఒత్తిడి కలగజేసి, పుర్రె వైపునకు నెట్టొచ్చు. మెదడులో రక్తం, మేరు ద్రవం (సెరిబ్రోస్పైనల్ ఫ్లూయిడ్) ప్రసరణకూ అడ్డుతగలొచ్చు. మేరుద్రవంలోకి విస్తరించి మెదడులో, వెన్నుపాములో మరిన్ని కణితులకూ దారితీయొచ్చు.

**ఎందుకొస్తాయి?**

మెదడు కణితులకు కచ్చితమైన కారణమంటూ లేదు. కానీ కొందరిలో వంశపారంపర్యంగా రావొచ్చు. దీనికి జన్యువులే కారణం. కొందరు ఎక్కువసేపు మొబైల్ ఫోన్లు మాట్లాడితే మెదడు కణితులు వస్తాయని అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. కణితులకూ మొబైల్‌ఫోన్ల వాడకానికీ సంబంధం ఉంటున్నట్టు రుజువు కాలేదు. కొందరికి రేడియేషన్ కారణం కావొచ్చు. నోరు, నాలుక, గొంతు వంటి భాగాల్లో తలెత్తిన క్యాన్సర్లకు రేడియేషన్

**చికిత్స**

చేసే సమయంలో కొన్నిసార్లు కొంత రేడియేషన్ ప్రభావం మెదడు మీద పడొచ్చు. దీంతో కొందరిలో ఐదారేళ్ల తర్వాత మెదడు కణితులు ఏర్పడే అవకాశముంది. **నాలుగు గ్రేడులు**మెదడు కణితుల ప్రవర్తన, తీరుతెన్నులను బట్టి 1, 2, 3, 4 గ్రేడులుగా విభజించొచ్చు. సాధారణంగా ఇతరత్రా క్యాన్సర్లు ఒకటో గ్రేడుతో మొదలై క్రమేపీ ముదురుతూ 4వ గ్రేడ్‌కు చేరుతుంటాయి. కానీ మెదడు కణితుల తీరే వేరు. క్రమంగా ఒక దశ నుంచి మరో దశకు వెళ్లటమనేది ఉండదు. కొన్నిసార్లు 3, 4 దశల్లోనే మొదలవ్వచ్చు. చాలావరకూ గ్రేడ్ 1 కణితులు మామూలువే. శ్రవణ నాడి మీద తలెత్తే కణితులు ఇలాంటివే. గ్రేడ్ 2, 3, 4 చెందినవి క్యాన్సర్ కణితులుగా పరిగణిస్తారు. వీటిల్లోనూ రెండో గ్రేడ్ కణితులు నెమ్మదిగా వృద్ధి చెందుతాయి. వీళ్లు చికిత్సతో 7 నుంచి 12 ఏళ్ల వరకూ బాగానే జీవించగలరు. గ్రేడ్ 3 కణితులు గలవారు 3–5 ఏళ్ల వరకూ సాధారణ జీవితం గడపగలరు. కొందరు ఏడేళ్ల వరకూ జీవించొచ్చు. అదే గ్రేడ్ 4 గలవారు ఎక్కువ కాలం జీవించటం కష్టం.

**నిర్ధారణ ఇలా**

మెదడు కణితిని అనుమానిస్తే మెదడు సీటీ స్కాన్ లేదా ఎమ్మారై పరీక్ష చేస్తారు. వీటితో కణితులు ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది. ఎమ్మారై పరీక్షలోనే అది మామూలుదా? క్యాన్సరా? అనేదీ అంచనా వేయొచ్చు. అయితే అన్నిసార్లూ అది కచ్చితం కాకపోవచ్చు. అందువల్ల శస్త్రచికిత్స చేసి, కణితిని తొలగించాక చిన్న ముక్కను తీసి పరీక్షించి (బయాప్సీ), నిర్ధారిస్తారు.దీంతో కణితి ఏ గ్రేడ్‌లో ఉందో కూడా తెలుస్తుంది. కణితులు కీలకమైన భాగంలో ఉండి, దాన్ని తొలగిస్తే పక్షవాతం లాంటి దుష్ప్రభావాలు తలెత్తే అవకాశముంటే పుర్రె ఎముకకు 2 మి.మీ. రంధ్రం చేసి.. రోబోటిక్ వ్యవస్థ సాయంతో చిన్న ముక్కను తీసి పరీక్షించొచ్చు (స్టీరియోటాక్టిక్ గైడెడ్ రోబోటిక్ బయాప్సీ).

**ప్రధాన లక్షణం తలనొప్పి**

మెదడులో కణితులు ముందు, వెనక, పైన, కింద, మధ్య భాగాల్లో ఎక్కడైనా ఏర్పడొచ్చు. ఇవి ఉన్న చోటును బట్టి ఆయా లక్షణాలు కనిపిస్తుంటాయి. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది తలనొప్పి. ముఖ్యంగా ఉదయం నిద్ర నుంచి లేచిన తర్వాత తలనొప్పి వస్తుంటుంది. పుర్రె ఎముక చాలా దృఢంగా ఉంటుంది. లోపల కణితి పెరుగుతున్నప్పుడు కపాలంలో ఒత్తిడి ఎక్కువై తలనొప్పి పుడుతుంది. వేగంగా పెరిగే క్యాన్సర్ కణితుల్లో వెంటనే తలనొప్పి మొదలవుతుంటుంది. ఈ నొప్పి వస్తూ పోతుంటుంది గానీ పూర్తిగా తగ్గదు. రోజంతా ఎప్పుడూ ఎంతో కొంత తలనొప్పి ఉంటుంది. వాంతి కూడా కావొచ్చు. వాంతి అయిన తర్వాత తలనొప్పి తగ్గినట్టు అనిపించటం మరో ప్రత్యేకత. మళ్లీ కొద్దిసేపట్లోనే తలనొప్పి పెరిగినట్టు అనిపిస్తుంది. ఇలాంటిది గుర్తిస్తే మెదడులో ఏదో సమస్య ఉండొచ్చని అనుమానించాలి.

**ఫిట్స్:**

పిల్లల్లో చాలావరకూ ఫిట్స్‌కూ కణితులకు సంబంధం ఉండదు. కానీ 20 ఏళ్లు దాటిన తర్వాత ఎవరికైనా ఉన్నట్టుండి ఫిట్స్ మొదలైతే మెదడులో కణితి ఉండొచ్చని అనుమానించాలి. వినికిడి లోపించటం: రెండు చెవుల్లో వినికిడి తగ్గితే మామూలే అనుకోవచ్చు. కానీ ఒక చెవిలో వినికిడి తగ్గితే శ్రవణ నాడి మీద కణితి ఉండొచ్చని అనుమానించాలి. చూపు తగ్గటం: కణితుల మూలంగా తలలో ఒత్తిడి పెరిగితే దాని ప్రభావం దృశ్యనాడి మీదా పడుతుంది. దీంతో చూపు తగ్గొచ్చు, ఒకటికి రెండు వస్తువులు కనిపించొచ్చు.

**మతిమరుపు:**

సాధారణంగా మతిమరపును మానసిక ఒత్తిడితో ముడిపడిందని అనుకుంటుంటారు. అయితే అప్పటివరకూ బాగానే ఉండి, అన్ని పనులు సక్రమంగా చేసుకుంటూ, పరీక్షల్లో బాగా మార్కులు తెచ్చుకుంటున్నవారిలో ఉన్నట్టుండి జ్ఞాపకశక్తి, తెలివితేటలు, ప్రజ్ఞ తగ్గితే మాత్రం అనుమానించాల్సిందే. ఆయా భాగాలను బట్టి: కొన్ని కణితులతో నడుస్తున్నప్పుడు శరీరం తూలొచ్చు, ఒకపక్కకు



ఒరిగిపోవచ్చు. కొందరు బాగానే మాట్లాడుతుండొచ్చు గానీ ఇతరులు చెప్పేది అర్థం కాకపోవచ్చు. కాలు, చేయి నెమ్మదిగా బలహీనం కావటం, చేతి రాత మారటం, చేత్తో పెన్ను పట్టుకోలేకపోవటం, నడుస్తున్నప్పుడు తెలియకుండానే కాలి నుంచి చెప్పు జారిపోవటం వంటివీ కనిపిస్తుండొచ్చు. ఇలాంటి లక్షణాలు హఠాత్తుగా ఉన్నట్టుండి మొదలై, రెండు మూడు వారాల్లోనే తీవ్రమైతే కణితి కారణం కావొచ్చని అనుమానించాలి. చికిత్స కణితి క్యాన్సర్‌దా? మామూలుదా? ఏ రకానికి, గ్రేడ్‌కు చెందింది? ఎంత సైజులో ఉంది? మెదడులో ఎక్కడుంది? అనే వాటిని బట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. సర్జరీ, రేడియేషన్, కీమోథెరపీల్లో ఎవరికి ఏది అవసరమో నిర్ణయిస్తారు. కొన్ని ఒక్క శస్త్రచికిత్సతోనే నయమైతే కొన్నింటికి రేడియేషన్, కీమో కూడా అవసరమవుతాయి.మామూలు కణితిని శస్త్రచికిత్సతో తొలగిస్తే సరిపోతుంది. కణితి సైజును బట్టి పుర్రెకు రంధ్రం చేసి, దాని ద్వారా పూర్తిగా బయటకు తీస్తారు. అదే క్యాన్సర్ కణితులకు శస్త్రచికిత్సతో తొలగించటంతో పాటు రేడియేషన్, కీమోథెరపీలూ అవసరమవుతాయి. శస్త్రచికిత్సకు ముందు ప్రత్యేకమైన ఫంక్షనల్ ఎంఆర్ఐ పరీక్ష చేసి మాటలు, కదలికలు, మింగటం వంటి పనులకు తోడ్పడుతున్న మెదడు భాగాలను గుర్తిస్తారు. అలాగే మెదడులోకి ఫ్లోరోసిన్ రంగును ఎక్కిస్తారు. ఇది కణితులకు అంటుకుంటుంది. పుర్రెకు రంధ్రం చేసి లోపలికి చూసినప్పుడు అవి వెలుగుతూ, స్పష్టంగా కనిపిస్తాయి. మైక్రోస్కోప్ ద్వారా లోపలికి చూస్తూ కణితి జాగ్రత్తగా తొలగిస్తారు. గ్రేడ్ 2 కణితులకు శస్త్రచికిత్స అనంతరం ఎన్‌జీఎఫ్ అనే జన్యు పరీక్ష చేయాల్సి ఉంటుంది. వీరికి రేడియేషన్ చికిత్స వెంటనే చేయాలా? కొద్దిరోజుల తర్వాత చేయాలా? అనేది నిర్ణయించటానికి దీని ఫలితాలు తోడ్పడతాయి. రకరకాలుమెదడు కణితుల్లో చాలారకాలే ఉన్నాయి. అవి ఏర్పడిన చోటు, ఏ కణాలతో ఏర్పడ్డాయో అనే దాన్ని బట్టి రకాలు ఆధారపడి ఉంటుంది. ఇతర అవయవాల్లో తలెత్తే క్యాన్సర్ కణాలు మెదడుకు చేరుకొని, కణితులుగా మారొచ్చు.గ్లయోమాలు: ఇవి నాడీకణాలను అనుసంధానం చేసే పోచల నుంచి పుట్టుకొస్తాయి. వీటిల్లో ఆస్ట్రోసైటోమా, ఆలిగోడెండ్రోగ్లయోమా, గ్లయో బ్లాస్టోమా మల్టీఫోర్మీ వంటి రకాలూ ఉన్నాయి. ఆలిగోడెండ్రోగయోమాలు సర్జరీ, కీమో, రేడియేషన్ చికిత్సలకు బాగా స్పందిస్తాయి. ఫలితమూ బాగుంటుంది.

**గ్యాంగ్లియోన్యూరోమా:**

వీటిని గ్యాంగ్లియోమా అనీ అంటారు. ఇవి మెదడు లోపల అటనమిక్ నాడీకణాల నుంచి తలెత్తుతాయి. సాధారణంగా పదేళ్లు పైబడ్డవారిలో కనిపిస్తుంటాయి. నెమ్మదిగా పెరిగే ఇవి చాలావరకూ మమూలు కణితులే.

**మెనింజియోమా:**

ఇవి మెదడు చుట్టూ ఉండే పొరల్లో (డ్యూరా) ఏర్పడతాయి. సాధారణంగా మామూలువే అయినా కొన్ని క్యాన్సర్లూ కావొచ్చు. గ్రంథి కణితులు: మెదడులోని పీనియల్, పీయూష వంటి గ్రంథుల్లో, వాటి చుట్టూరా ఏర్పడతాయి. పిల్లల్లో పీనియల్‌బ్లాస్టోమా ఎక్కువ. ఆస్టియోమా: వీటిని ఆస్టియోసార్కోమా అనీ అంటారు. ఇవి పుర్రె ఎముక నుంచి పుట్టుకొస్తాయి. నాడి కణితులు: ఇవి నాడుల్లో లేదా నాడుల మీద ఏర్పడుతుంటాయి. వీటిల్లో ప్రధానమైంది శ్రవణనాడి మీద తలెత్తే అకౌస్టిక్ న్యూరోమా. దీన్నే ష్వానోమా అనీ అంటారు. గ్రేడ్ 3, 4 అయినట్టయితే రేడియేషన్, కీమోథెరపీ తప్పనిసరి.ఒకప్పుడు మెదడు కణితులను తొలగించటానికి పుర్రెకు పెద్ద రంధ్రం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు నావిగేషన్ పద్ధతితో చిన్న రంధ్రంతోనే సాధ్యమవుతోంది. మెదడు ఎంఆర్ఐ, రోగి ముఖం తీరుతెన్నులను సమ్మిళితం చేసి ఎక్కడ రంధ్రం చేయాలో నిర్ణయించటానికిది తోడ్పడుతుంది. అలాగే దగ్గరి దారిలో కణితి ఉన్న చోటుకు కచ్చితంగా తీసుకెళ్తుంది. ఫోన్‌లో జీపీఎస్ మాదిరిగా దారి చూపిస్తుందన్నమాట. మెదడులో కీలకమైన భాగాల్లో కణితి ఉన్నప్పుడు తల భాగానికి మాత్రమే మత్తు ఇచ్చి శస్త్రచికిత్స చేయొచ్చు. సర్జరీ చేస్తున్నపుడు రోగులు స్పృహలోనే ఉంటారు. వారితో మాట్లాడుతూ.. చేతులు, కాళ్లు కదిలించటానికి ఏయే భాగాలు తోడ్పడుతున్నాయో గుర్తిసారు. వాటికి ఎలాంటి హాని కలిగించకుండా కణితిని మాత్రమే తొలగిస్తారు. భవిష్యత్ చికిత్సల ఆశ‘ ఇప్పుడు రక్తపరీక్ష ద్వారా కణితి రకాన్ని గుర్తించటం మీద పరీక్ష ప్రయోగాలు నడుస్తున్నాయి. ఒకసారి రేడియేషన్ ఇస్తే సరిపోతుంది.

**అన్నీ క్యాన్సర్లు కావు**

మెదడు కణితులన్నీ క్యాన్సర్లు కావు. దాదాపు సగం వరకూ మామూలువే (బినైన్) ఉంటాయి. సాధారణంగా మామూలు కణితులు నెమ్మదిగా ఏడాదికి 2 మి.మీ. మాత్రమే పెరుగుతాయి. ఫిట్స్, వినికిడి లోపించటం వంటి లక్షణాలు కనిపించినప్పుడో, ప్రమాదాల్లో గాయపడినప్పుడో స్కాన్ చేసినప్పుడు బయటపడుతుంటాయి. కానీ క్యాన్సర్ కణితులు అలా కాదు. చాలా వేగంగా వృద్ధి చెందుతాయి. చుట్టుపక్కల మెదడు కణాలను తీవ్రంగా దెబ్బతీస్తూ వస్తుంటాయి. గామానైఫ్ అద్భుతంమామూలు గ్రేడ్ 1 కణితుల సైజు 2.5 సెం.మీ. కన్నా తక్కువగా ఉంటే బయటి నుంచే గామానైఫ్‌తో చికిత్స చేయొచ్చు. పుర్రెకు రంధ్రం పెట్టాల్సిన అవసరముండదు. గామానైఫ్ అనేది రేడియేషన్ పరికరం. ఇది వివిధ కోణాల నుంచి కణితి మీద మాత్రమే రేడియేషన్ పడేలా చేయటం ద్వారా కణితిని నిర్మూలిస్తుంది.

# యమహో ఏజెంటిక్ బ్రౌజర్

కొత్త తరం ఏఐ ఆధారిత బ్రౌజర్ల రాకతో ఇంటర్నెట్‌ను శోధించే తీరే మారిపోయింది. ఏజెంటిక్ ఏఐ బ్రౌజర్లుగా పిలుచుకుంటున్న ఇవి స్మార్ట్‌ఫోన్, పీసీ తెరల మీద ఏమేం ఉన్నాయో చూడగలవు. ప్రాంప్ట్‌లు, మాటల రూపంలో ఇచ్చే సందేశాలను అర్థం చేసుకోగలవు. వాటి ప్రకారం నడచుకోగలవు. ఆయా అంశాలను వెతకటం, సమాచారాన్ని సంక్షిప్తీకరించటం దగ్గరి నుంచి ఫారాలు నింపటం, షాపింగ్, ప్రయాణ టికెట్లు బుక్ చేయటం వంటి ఆన్‌లైన్ సేవల వరకూ ఎన్నెన్నో పనులు చేసి పెడుతున్నాయి. అలాంటి కొన్ని ఏజెంటిక్ ఏఐ బ్రౌజర్ల గురించి తెలుసుకుందామా.

**చాట్‌జీపీటీ అట్లాస్:** ప్రసుత ఏఐ బూమ్‌ను



పెల్లుబికేలా చేసింది చాట్‌జీపీటీనే. లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఆధారిత చాట్‌బాట్స్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది. చాట్‌జీపీటీ అట్లాస్‌తో ఏజెంటిక్ వెబ్ బ్రౌజింగ్‌ను చేరువ చేసింది. ఓపెన్‌ఏఐకి చెందిన అధునాతన ఏఐ మోడల్ అయిన జీపీటీ–5తో కూడిన ఇది చాలా శక్తిమంతమైంది. ఒకసారి ఏజెంట్ మోడ్‌ను యాక్టివేట్ చేసుకుంటే సైడ్‌బార్‌లోని ఆస్క్ చాట్‌జీపీటీ ద్వారా సూచనలు ఇవ్వచ్చు. పేజీలు ఓపెన్ చేయటం, ఫారాలు పూరించటం వంటి పనులన్నీ తనే చేస్తుంది. తన మౌజ్, కీబోర్డుతో పనులు పూర్తిచేస్తుంది. ఒకరకంగా మీ కంప్యూటర్‌ను రోబోకు అప్పగించినట్టుగా అనిపిస్తుంది. చాట్‌జీపీటీ మాదిరిగానే అట్లాస్ బ్రౌజర్‌కూ తనదైన మెమరీ ఉంటుంది. అందుకే సమాచారాన్ని దాచుకొని, గుర్తుతెచ్చుకోగలదు. మనకు అవసరమైన పనులు చేయటానికి వీటికి వాడుకోగలదు. ప్రస్తుతం ప్రొ లేదా ప్లస్ టయర్ యూజర్లకు మాత్రమే.. అదీ మ్యాక్‌ఓఎస్ మీదే ఏఐ ఏజెంట్ మోడ్ అందుబాటులో ఉంది. త్వరలో ఎక్కువ మందికి అందుబాటులోకి వచ్చినా ఆశ్చర్యపోనసరం లేదు. ఒపేరా నియాన్: ఒపేరాకు చెందిన ఏరియా బ్రౌజర్ ఏఐతో దీన్ని రూపొందించారు. మాటల రూపంలో ఇచ్చే ప్రాంప్ట్‌లను అర్థం చేసుకుంటుంది, ఇమేజ్‌లను సృష్టిస్తుంది. దీని ప్రత్యేకత ప్రైవసీ. హైబ్రిడ్ ప్రాసెసింగ్ మోడల్ ద్వారా పరికరంలోని కంప్యూటింగ్ వనరులు, క్లౌడ్ మధ్య తెలివిగా సమతుల్యత పాటిస్తుంది. సున్నిత సమాచారం, వ్యక్తిగత సంభాషణలను పరికరానికే పరిమితం చేస్తుంది. పనిభారం ఎక్కువగా ఉంటే దాన్ని క్లౌడ్‌కు బదిలీ చేస్తుంది.

**పర్‌ప్లెక్సిటీ కామెట్:**




గూగుల్ వంటి సంప్రదాయ సెర్చ్ ఇంజిన్ల ఆధిపత్యాన్ని సవాల్ చేయటానికి 'ఆన్సర్ ఇంజిన్'గా కామెట్‌ను రూపొందించారు. మంచి స్పందన రావటంతో ఏజెంటిక్ ఏఐ బ్రౌజర్‌గా తీర్చిదిద్దారు. ఇప్పుడిది షాపింగ్, క్యాలెండర్ మేనేజింగ్, ఈమెయిల్ డ్రాఫ్టింగ్ వంటి అటనమస్ పనులను తేలిగ్గా చేసేస్తోంది. రిసెర్చ్ టూల్‌గానూ ఉపయోగపడటం విశేషం. చాలా ట్యాబ్‌లను ఓపెన్ చేయటానికి, వేర్వేరు వనరుల నుంచి సమాచారాన్ని క్రోడీకరించటానికిది వీలు కల్పిస్తుంది. ఈ విషయంలో ఇతర ఏజెంటిక్ బ్రౌజర్లతో పోలిస్తే కామెట్ తన ప్రత్యేకతను ప్రదర్శిస్తోంది.

**మ్యానస్:**

దీన్ని ఏజెంటిక్ బ్రౌజర్ అనటం కన్నా 'క్లౌడ్‌లో




బ్రౌజర్'గా చెప్పుకోవచ్చు. నాచురల్ లాంగ్వేజ్ ఇంటర్ఫేస్ ద్వారా దీనికీ సూచనలు ఇవ్వచ్చు. కాకపోతే ఇది మన బ్రౌజర్ ద్వారా కాకుండా క్లౌడ్‌లో తన సొంత బ్రౌజర్‌లో కంప్యూటింగ్ చేస్తుంది. న్యూస్ సైట్లను స్కాన్ చేయటం దగ్గరి నుంచి డేటా సారాంశం వరకూ చాలా పనులు నిర్వహిస్తుంది. మనుషుల పర్యవేక్షణ, గైడెన్స్ లేకపోయినా సంక్లిష్టమైన, వివిధ అంచెల రిసెర్చ్ ప్రక్రియలనూ చేపడుతుంది.

# థైరాయిడ్ తగ్గించుకోవచ్చు

ట్రూకాలర్ మనదేశంలో ఆండ్రాయిడ్ యూజర్ల కోసం కొత్తగా వాయిస్‌మెయిల్ ఫీచర్‌ను తీసుకొచ్చింది. మిస్డ్ కాల్స్ నుంచి వాయిస్ మెసేజ్‌లను స్వీకరించటానికి, వాటి ట్రాన్స్‌క్రిప్షన్‌ను చదవటానికిది వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ మనదేశంలో అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ప్రీమియం చందా తీసుకున్నవారికి ఏఐ ఆధారిత కాల్ ఫీచర్లూ లభిస్తాయి. దీన్ని



వాడుకోవాలంటే ఆ నంబరు మీద కాల్ ఫార్వర్డింగ్ ఎనేబుల్ అయ్యిండటం తప్పనిసరి. ఇందులో స్మార్ట్ కాల్ కేటగిరైజేషన్, స్పామ్ ఫిల్టరింగ్‌తో పాటు ప్లేబ్యాక్‌ను అడ్జస్ట్ చేసుకోవటం వంటి ఫీచర్లూ ఉంటాయి. వాయిస్‌మెయిల్‌ను వినటమే కాదు, చదువుకోవచ్చు కూడా. ఇది తెలుగుతో పాటు 12 భాషల్లో వాయిస్‌మెయిల్‌ను ట్రాన్స్‌క్రిప్ట్ చేస్తుంది. ఈ వాయిస్‌మెయిళ్లనీ పరికరంలోనే స్టోర్ అవుతాయి. ఇదెలా పనిచేస్తుందంటే.. మనం ఎవరికైనా ఫోన్ చేసినప్పుడు అవతలివారు కాల్ ఎత్తనప్పుడు ఈ ఫీచర్ మీద తాకి మాటలను రికార్డు చేయొచ్చు. అది వెంటనే అవతలివారికి చేరుతుంది. వాళ్లు దాని వినొచ్చు లేదా చదవొచ్చు. వెంటనే తిరిగి కాల్ చేయాల్సిన అవసరమున్నప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది.

# హ్యూమనాయిడ్ రోబోల డ్యాన్స్



చైనాలో కొన్ని హ్యూమనాయిడ్ రోబోలు చేసిన డ్యాన్స్ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అచ్చం మనుషుల్లాగే డ్యాన్స్ చేస్తూ అదరగొట్టేశాయి. చైనాలో ఇటీవల 2026 స్ప్రింగ్ ఫెస్టివల్ గాలా నిర్వహించారు.

హ్యూమనాయిడ్ రోబోల డ్యాన్స్.. స్టెప్పులు అదిరిపోయాయ్.. వావ్ అనాల్సిందే

ఎఱతీఖశ్రీ ఎఱఅసవశీ : హ్యూమనాయిడ్ రోబోలంటే అచ్చం మనుషుల్లాగే ఉంటాయి. వాటి నడక, మాట, పనులు వంటివి దాదాపు మనిషిని పోలి ఉంటాయి. మన దేశంలో ఇంకా ఇలాంటివి పూర్తిగా అందుబాటులో లేకపోయినా చైనా, జపాన్ వంటి దేశాల్లో వీటి హవా నడుస్తోంది. ఇవి అనేక రంగాల్లో మనుషుల స్థానాన్ని ఆక్రమిస్తాయని ప్రచారం జరుగుతోంది. ఇదంతా ఎలా ఉన్నా ఇప్పుడు చైనాలో కొన్ని హ్యూమనాయిడ్ రోబోలు చేసిన డ్యాన్స్ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

అచ్చం మనుషుల్లాగే డ్యాన్స్ చేస్తూ అదరగొట్టేశాయి. చైనాలో ఇటీవల 2026 స్ప్రింగ్ ఫెస్టివల్ గాలా నిర్వహించారు. ఈ వార్షిక ఈవెంట్‌లో అనేక కళా ప్రదర్శనలు జరిగాయి. వాటిలో హ్యూమనాయిడ్ రోబోలు చేసిన ఆర్ట్ పర్ఫామెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మార్షల్ ఆర్ట్స్ దగ్గరి నంచి డాన్స్ వరకు అదరగొట్టేశాయి. అందులో కొన్ని రోబోలు స్టేజిపై చేసిన డాన్స్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో రోబోల డ్యాన్స్ చూసిన వాళ్లు ఔరా అంటున్నారు.

మనుషులకు ఏమాత్రం తీసిపోకుండా, ప్రొఫెషనల్ డ్యాన్స్‌తో ఆకట్టుకున్నాయి ఈ రోబోలు. యునిట్రీ రోబోటిక్స్ సంస్థ ఈ ప్రదర్శన ఇచ్చింది. ఈ సంస్థ తయారు చేసిన జీ1, హెచ్2 హ్యూమనాయిడ్ రోబోలు వూబోట్ తరహా ప్రదర్శన ఇచ్చాయి. అయినా, ఆ డ్యాన్స్ గురించి ఎక్కువగా చెప్పడం ఎందుకు.. మీరే చూసేయండి.

# కంటి జబ్బులకు వినూత్న చికిత్స




ప్రపంచ ఫార్మా రాజధాని హైదరాబాద్‌లో మరో వినూత్నమైన కంపెనీ అడుగుపెట్టింది. ఎక్సోసోమ్‌ల ఆధారంగా కణజాలాన్ని పునరుత్పత్తి చేయగల టెక్నాలజీ సాయంతో ఆసియా పసఫిక్ ప్రాంతం మొత్తానికి సరికొత్త కంటి చికిత్సలు అందించేందుకు పండోరమ్ టెక్నాలజీస్, హైదరాబాద్‌లోని నూసిలియాన్ థెరప్యూటిక్స్‌లు చేతులు కలిపాయి. శరీర కణాలు స్రవించే అతిసూక్ష్మమైన భాగాలైన (30 నుంచి 150 నానోమీటర్లు) ఎక్సోసోమ్‌లు ప్రొటీన్లు, ఆర్ఎన్ఏ వంటివాటిని ఒక కణం నుంచి ఇంకో కణానికి మోసుకెళుతూంటాయి. వీటి స్థానంలో మందులను పంపిణీ చేయడం ద్వారా పాడైన కణాలను సరిచేయవచ్చునని అంచనా. ఈ దిశగా పండోరమ్ టెక్నాలజీస్ ఇప్పటికే కొంత ముందడుగు వేసింది.కనుగుడ్డు (కార్నియా) దెబ్బతిన్న వారికి మళ్లీ చూపు రప్పించేందుకు కూడా తాము తయారు చేసిన ఎక్సోసోమ్ మందు ఉపయోగపడుతుందని కంపెనీ చెబుతోంది. ఈ నేపథ్యంలో పండోరమ్ టెక్నాలజీస్, భారత్ బయోటెక్ అనుబంధ సంస్థ అయిన నూసిలియాన్ థెరప్యూటిక్స్‌ల మధ్య కుదిరిన వ్యూహాత్మక ఒప్పందానికి ప్రాధాన్యం ఏర్పడింది. పండోరమ్ టెక్నాలజీ అభివృద్ధి చేసిన ఎక్సోసోమ్ మందును నూసిలియాన్ పెద్ద ఎత్తున తయారు చేస్తుంది. ఆసియా పసఫిక్ ప్రాంతం మొత్తానికి సరఫరా చేస్తుంది. దేశంలో ఇలాంటి ప్రయత్నం జరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం."పునరుత్పత్తి మందుల తయారీ విషయంలో పండోరమ్ ఇప్పటికే మేలి ముందడుగు వేసింది. పరిశోధనలు, వాణిజ్యాంశాల్లోనూ ప్రగతి సాధించాము. అడ్వాన్స్‌డ్ బయోలాజిక్స్ తయారీలో నైపుణ్యమున్న నూసిలియాన్‌తో చేతులు కలపడం ద్వారా ప్రపంచం మొత్తానికి ఈ వినూత్నమైన చికిత్సను అందించవచ్చు" అని పండోరమ్ టెక్నాలజీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ తుహిన్ భౌమిక్ తెలిపారు.నూసిలియాన్ థెరప్యూటిక్స్ ఉన్నతాధికారి డాక్టర్ రఘు మలపాక మాట్లాడుతూ "కంటి జబ్బుల చికిత్స విషయంలో పండోరమ్ టెక్నాలజీస్ ఎక్సోసోమ్ ఆధారిత చికిత్స విప్లవాత్మకమైందని చెప్పాలి. బయలాజిక్స్ తయారీలో మాకున్న నైపుణ్యంతో ఎంతో మేలు చేకూరుతుంది" అని వివరించారు.ప్రస్తుతం కంటి జబ్బులపై మాత్రమే దృష్టి పెడుతున్నామని, స్టీవెన్స్–జాన్సన్ సిండ్రోమ్, న్యూట్రోఫిక్ కెరటిటిస్ వంటి వాటికి త్వరలో చికిత్స అందించగలమని కంపెనీ చెబుతోంది. భవిష్యత్తులో ఇదే ఎక్సోసోమ్ ఆధారిత టెక్నాలజీ సాయంతో వాపు కారణంగా చర్మం, ఊపిరితిత్తులు, ఫైబ్రోసిస్‌తోపాటు ఇతర అవయవాలకు వచ్చే సమస్యలకు పరిష్కారం చూపగలమని చెబుతోంది.

# ఏఐ సమ్మిట్‌లో నిరసన..




ఏఐ సమ్మిట్‌లో షర్ట్ విప్పి నిరసన వ్యక్తం చేసిన కేసులో.. ఢిల్లీ పోలీసులు ఇవాళ ఇండియన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఉదయ్ భాను చిబ్‌ను అరెస్టు చేశారు. కస్టడీలోకి తీసుకోవడానికి ముందు ఆయన్ను సుమారు 20 గంటల పాటు పోలీసులు ప్రశ్నించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో గత వారం ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరిగిన విషయం తెలిసిందే. ఆ సదస్సులో కాంగ్రెస్ కార్యకర్తలు షర్ట్ విప్పి నిరసన వ్యక్తం చేసిన కేసులో.. ఢిల్లీ పోలీసులు ఇవాళ ఇండియన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఉదయ్ భాను చిబ్‌ను అరెస్టు చేశారు. కస్టడీలోకి తీసుకోవడానికి ముందు ఆయన్ను సుమారు 20 గంటల పాటు పోలీసులు ప్రశ్నించారు. దీంతో ఈ కేసులో అరెస్టు అయిన వారి సంఖ్య 8కి చేరుకున్నది. ఇండియన్ యూత్ కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురిని కొన్ని రోజుల క్రితం అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ నుంచి ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ ముగ్గుర్నీ జితేంద్ర యాదవ్, రాజ్ గుజ్జార్, అజయ్ కుమార్‌గా గుర్తించారు. ఐవైసీ యూపీ జనరల్ సెక్రటరీ రితిక్ అలియాస్ మోంటీ శుక్లాను లలిత్‌పూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు. సెక్షన్ 196, 197 కింద కేసులు జోడించారు. ఈ కేసుల్లో మూడేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉన్నది. నేరపూరిత కుట్ర, ప్రజా విధులను అడ్డుకోవడం లాంటి కేసులను ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లో జోడించారు. గత శుక్రవారం సుమారు 10 మందికిపైగా ఐవైసీ కార్యకర్తలు.. ఏఐ ఇంపాక్ట్ సదస్సు జరుగుతున్న భారత మండపంలోని హాల్ నెంబర్ 5లోకి చొరబడి అక్కడ ఉన్న స్టేజ్‌పై షర్ట్‌లు తీసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ప్రింట్ చేసిన టీషర్ట్‌లను ధరించి ఆ కాంగ్రెస్ కార్యకర్తలు లోపలికి ప్రవేశించారు. వేదిక వద్దకు వచ్చేందుకు నిరసనకారులు ఆన్‌లైన్ ద్వారా క్యూఆర్ కోడ్‌లను రిజిస్టర్ చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆ నిరసన వెనుక ఉన్న నేరపూరిత కుట్ర, ఆర్థిక పరిస్థితులను దర్యాప్తు చేయనున్నారు.

# ఒక్క దెబ్బతో అన్‌సబ్‌స్క్రైబ్

న్యూస్‌లెటర్లు, ప్రమోషనల్, ఇతర సబ్‌స్క్రిప్షన్ మెయిళ్లతో విసిగిపోయేవారిని దృష్టిలో పెట్టుకొని జీమెయిల్ కొత్తగా మేనేజ్ సబ్‌స్క్రిప్షన్స్ ఫీచర్‌ను తీసుకొచ్చింది. జీమెయిల్ పేజీలో పైన ఎడమ వైపున నావిగేషన్ బార్ మీద తాకితే కింద జాబితాలో ఇది కనిపిస్తుంది. ఇందులో తరచూ, ఎక్కువగా అందే సబ్‌స్క్రిప్షన్ మెయిళ్లు కనిపిస్తాయి. ఏదో ఒక దాని మీద తాకి, సెండర్ పక్కన కనిపించే అన్‌సబ్‌స్క్రైబ్ మీద క్లిక్ చేస్తే సరి. ఆ సెండర్ పంపించిన మెయిళ్లన్నీ పోతాయి. న్యూస్‌లెటర్లు, సబ్‌స్క్రిప్షన్ మెయిళ్లను అన్‌సబ్‌స్క్రైబ్ చేసుకోవటానికి జీమెయిల్‌లో ఇప్పటికే ఒక ఫీచర్ ఉంది. కొత్త ఫీచర్ రాకతో ఇది మరింత సులభమైంది. జీమెయిల్ వెబ్, ఆండ్రాయిడ్ వర్షన్లకు ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. జులై 21న ఐఓఎస్ పరికరాలకు అందుబాటులోకి వస్తుంది.

# పాపికొండ నేషనల్ పార్కులోనే పెద్దపులి: సీసీఎఫ్



**వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం) :** తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలోని జనావాసాల్లో పట్టుకొన్న పెద్దపులి ప్రస్తుతం పాపికొండ నేషనల్ పార్కులోనే ఉందని, అది మళ్లీ జనావాసాల్లోకి రాకుండా అన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని రాజమహేంద్రవరం ప్రాంతీయ ముఖ్య అటవీ సంరక్షణాధికారి(సీసీఎఫ్) శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సాంకేతికతతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. రంపచోడవరం దగ్గర సున్నంపాడు తదితర ప్రాంతాల్లోని జనావాసాల్లో మళ్లీ పెద్దపులి తిరుగుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో కొన్ని వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ అవుతున్న వీడియోలు ఈ పులికి సంబంధించినవి కావన్నారు. వీడియో కాలర్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఆ పులి స్వచ్ఛగా అక్కడే రెడ్‌జోన్‌లో తిరుగుతోందని, దానికి ఆహారం కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

# వీడని కల్తీ గుట్టు



**రాజమహేంద్రవరం/కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/మహారాణిపేట (విశాఖ):** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాలకూట విష ప్రభావం రోజు రోజుకూ మరింతగా పెరుగుతోంది. తాజాగా స్వరూప్ నగర్‌కు చెందిన చిన్నారి డి.మనోహర్ (6) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అ బాలుడిని మూత్రపిండాల సమస్యతో తొలుత రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు.

పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి నుంచి ఆదివారం మధ్యాహ్నం విశాఖకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మనోహర్ కిడ్నీ ఫెయిలైందని వెల్లడించారు. డయాలసిస్ చేశారు. కల్తీ పాలు తాగడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆ బాలుడి కుటుంబ సభ్యులకు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ మనోహర్ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రస్తుతం అక్కడి మార్చురీలోనే ఉంచారు.

**ఆస్పత్రిలో చేరిన మరో బాధితురాలు**

ఇప్పటికే కల్తీ పాలు తాగి 19 మంది అస్వస్థతకు గురవగా.. మంగళవారం మరో కేసు నమోదైంది. రాజమహేంద్రవరం నగరానికి చెందిన రెడ్డి అనంతలక్ష్మి (55) మూత్రపిండాల వ్యాధితో డెల్టా ఆస్పత్రిలో చేరారు. ఆమెను తొలుత కిమ్స్ ఆస్పత్రిలో చేర్చేందుకు సర్వం సిద్ధం చేశారు. అయితే ఆ ఆస్పత్రిలో ఇప్పటికే ఇదే కేసు బాధితులు ఎక్కువ మంది ఉండటంతో డెల్టా ఆస్పత్రికి మార్చారు. ప్రస్తుతం ఆమెకు డయాలసిస్ చేస్తున్నారు.

దీంతో బాధితుల సంఖ్య 21కి చేరింది. వీరిలో ఆరుగురు ఇప్పటికే మృతి చెందగా.. మిగిలిన 15 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. రెయిన్‌బో ఆస్పత్రిలో మూడేళ్లలోపు చిన్నారులు ముగ్గురు చికిత్స పొందుతున్నారు. వారికి రోజుకు రెండుసార్లు డయాలసిస్ చేస్తున్నారు. ఈ దృశ్యాలు చూపరులను కలచివేస్తున్నాయి.

**హెల్త్ బులెటిన్ విడుదల**

కల్తీ పాల ఘటనపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మంగళవారం నివేదిక విడుదల చేసింది. లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వర నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాలకు చెందిన పలువురు వృద్ధులు అనూరియా, వాంతులు, పొత్తికడుపు నొప్పి, తీవ్ర మూత్రపిండ వైఫల్యంతో ఆసుపత్రిలో చేరినట్టు గుర్తించారు. రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయిలు అధికంగా ఉండటంతో విషపూరిత ప్రభావం ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు.

పాల వినియోగమే దీనికి ప్రధాన కారణమని తేలింది. నెఫ్రాలజిస్టులతో కూడిన 14 ఫీల్డ్ సర్వేలెన్స్ బృందాలు 679 ఇళ్లను సందర్శించి 957 కుటుంబాలను స్క్రీనింగ్ చేశాయి. 110 కుటుంబాల్లో 293 మందిని గుర్తించి 315 రక్త నమూనాలు సేకరించారు. వాటిలో 313 సాధారణంగా ఉండగా ఇద్దరిలో యూరియా, క్రియాటినిన్ స్థాయిలు పెరిగినట్లు వెల్లడైంది.

**సెంట్రల్ జైలుకు పాల వ్యాపారి తరలింపు**

కల్తీ పాల వ్యాపారి అడ్డాల గణేష్ అరెస్టుపై హైడ్రామా నడిచింది. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గణేష్ ను అరెస్టు చేసిన పోలీసులు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలీసుల అదుపులో ఉన్న అతడికి కడుపు నొప్పి రావడంతో మంగళవారం కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడు కోలుకోవడంతో కోర్టులో హాజరుపర్చగా.. మార్చి 10 వరకూ రిమాండ్ విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

కల్తీ పాల గుట్టు ఇంకా వీడలేదు. కల్తీపై స్పష్టత రావాలంటే రక్తం, పాల నమూనాల నివేదికలు రావాల్సి ఉంది. ఇవి మంగళవారం వచ్చే అవకాశముందని అధికారులు వెల్లడించినా.. మరికొంత సమయం పట్టవచ్చని భావిస్తున్నారు. ల్యాబ్ రిపోర్టులు వస్తేగాని.. మరణాలు ఎలా సంభవించాయి.. పాలు పూర్తిస్థాయిలో కల్తీ జరిగాయా.. లేక వేరే ఏమైనా కలుషితం జరిగాయా అనే విషయం స్పష్టమవుతుంది.

కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం అత్యుత్సాహంతో కూలెంట్ లీకేజీ సంభవించి 'ఇథలీన్ గ్లైకాల్' కలవడంతో పాల కల్తీ జరిగి ఈ మరణాలు సంభవించాయనే వాదన వినిపిస్తున్నారు. ల్యాబ్ రిపోర్టులు అందకుండానే దీనిపై ఎలా నిర్ధారిస్తున్నారనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా.. పాల వ్యాపారి అడ్డాల గణేష్ డెయిరీ వద్ద పాల కల్తీకి ఉపయోగించే అనుమానిత పౌడర్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఆ పౌడర్ ఏమిటనేదానిపై ల్యాబ్ నివేదికలు రావాల్సి ఉంది. అప్పుడే కల్తీ గుట్టు వీడుతుంది.

**మెలమైన్ కూడా కలిసే అవకాశం**

పాలల్లో ఇథలీన్ గ్లైకాల్‌తోపాటు యూరియా, మెలమైన్ కలిసే అవకాశం ఉందని ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ రవిరాజు, విశాఖపట్నం కేజీహెచ్‌కు చెందిన డాక్టర్ గుళ్లపల్లి ప్రసాద్, డాక్టర్ సుధాకర్ వెంచురి, పి.శశాంక పాకలపాటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్తీ పాల కేసులను వీరే సమన్వయం చేస్తున్నారు. బాధితుల నుంచి సేకరించిన రక్త నమూనాలకు పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ల్యాబ్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నామని, ఫలితాలు 2 నుంచి 4 రోజుల్లో వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

63 సార్లు డయాలసిస్ చేసినా..

రాజమహేంద్రవరంలోని స్వరూప్ నగర్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు డి.మనోహర్‌కు కేజీహెచ్‌లో ఆరు రోజుల్లో ఏకంగా 63 సార్లు డయాలసిస్ చేయాల్సి వచ్చింది. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఆ బాలుడు మంగళవారం ప్రాణం వదిలాడు. ఈ నెల 18న అతడిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. అతడికి పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోడాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో వైద్యులు కిడ్నీ సమస్య ఉందని వైద్యులు గుర్తించి, అప్పుడే వైద్యం ప్రారంభించారు. చివరకు కిడ్నీ ఫెయిల్యూర్ కారణంగా బాలుడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

అసలు ఊహించలేదు

కల్తీ పాలు తాగటం వల్లే మా అబ్బాయి చనిపోయాడు. మూడేళ్లుగా గణేష్ వద్దే పాలు తీసుకుంటున్నాం. ఇంట్లో మా బాబు ఒక్కడే పాలు తాగుతున్నాడు. మహా శివరాత్రి నుంచి మా అబ్బాయికి ఆరోగ్యం బాగోలేదు. ఆ రోజు నుంచే యూరిన్ ఆగిపోయింది. రాజమండ్రి ఆస్పత్రి నుంచి కాకినాడ పంపారు. అక్కడి నుంచి 18న వైజాగ్ తీసుకొచ్చాం. మంగళవారం మధ్యాహ్నం చనిపోయాడని తెలిపారు. మనోహర్‌ను నమ్ముకునే బతుకుతున్నాం. ఇలా జరుగుతుందని ఊహించలేదు. ఉ **అర్చన, బాలుడి తల్లి, రాజమహేంద్రవరం**

**రెండింటి వల్ల కిడ్నీ పాడవుతుంది**

పాలు కల్తీ ఎలా జరిగాయనేది ల్యాబ్ రిపోర్టులు వస్తేనే కానీ చెప్పలేం. ఫ్రిజ్ నుంచి ఇథలీన్ గ్లైకాల్ లీకై పాలలో కలిసినా కిడ్నీ సమస్యలు వస్తాయి. అలా కాకుండా పాలలో యూరియా వంటి రసాయనాలు కలిపినా కిడ్నీ ఫెయిలయ్యే అవకాశం ఉంటుంది. గణేష్ వద్ద పాలు తీసుకున్న వారంతా కిడ్నీ పనితీరును నిర్ధారించే క్రియాటినిన్ పరీక్షలు తప్పక చేయించుకోండి. తేడా వస్తే ఆలస్యం చేయకుండా వెంటనే చికిత్సలు పొందండి. ఉ డాక్టర్ శశాంక్, నెఫ్రాలజిస్ట్, రాజమహేంద్రవరం

**బాధ్యులపై చర్యలేవీ?**

మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం

సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో జనం చచ్చిపోతున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూస్తూ కూర్చుందని మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజమండ్రిలో కల్తీ పాలు తాగి ప్రజలు చనిపోవడానికి ప్రభుత్వ అవినీతి, పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణమని అన్నారు. 'ఓ వ్యక్తిపై చర్య తీసుకుని చేతులు దులుపుకుంటారా.. బాధ్యులైన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు.

కొన్ని నెలలుగానో, అంతకు ముందు నుంచో కల్తీ జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు. జనం చచ్చిపోతుంటే పట్టించుకోకుండా, ప్రశ్నించే వారిపై మాత్రం కక్ష సాధింపు చర్యలపై మాత్రమే ఈ ప్రభుత్వం దృష్టి సారించింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అవినీతి భారీగా పెరిగిపోయిందని, ఇదేంటని ఎవరినైనా అడిగితే పెదబాబు, చినబాబులకు ముడుపులు ఇస్తున్నామని చెబుతున్నారని చెప్పారు.

# విద్యుత్తు తీగలు.. యమపాశాలు



**బాలాజీచెరువు:** కాకినాడలోని డెయిరీ ఫారం కూడలిలో భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు ఇనుప ఊచను పైకి ఎత్తి తీసుకు వస్తుండగా తీగలకు తగిలాయి. గాయపడిన అతను చికిత్స పొందుతూ మరణించాడు. కాకినాడ గ్రామీణ మండలం, వాకలపూడిలో 33/11కేవీ లైను ఓ ఇంటికి అతి సమీపంలో వెళుతోంది. ఇంటి యజమానురాలు మేడపై చీర ఆరేసినప్పుడు కొంత భాగం తీగలపై పడింది. గమనించకుండా ఆమె చీర తీయడానికి ప్రయత్నించగా విద్యుత్తు షాక్‌కు గురై రెండు కాళ్లు కోల్పోవాల్సి వచ్చింది. గతంలో విద్యుత్తు ప్రమాదాలు బయట ప్రదేశాల్లో జరిగేవి. ఇటీవల కాలంలో ఇళ్ల వద్దే ఎక్కువగా జరుగుతున్నాయి. నిర్మాణ రంగంలో పనులు చేసేటప్పుడు ఇనుప ఊచలు పైకి ఎత్తే క్రమంలో, ఇంటి పిట్టగోడకు ఆనుకుని వెళుతున్నప్పుడు, మేడపై దుస్తులు ఆరవేసేటప్పుడు ఎక్కువగా జరుగుతున్నాయి. 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి వరకు జిల్లాలో విద్యుత్తు ప్రమాదాల్లో 58 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

భవనాలకు ప్లాస్టరింగ్, రంగులు వేసేటప్పుడు తీగలను పరిశీలించుకోవాలి. ఆక్వా రంగంలో చెరువుల వద్ద ఏరియేటర్లకు గట్ల మీద నుంచి కనెక్షన్ లాగుతున్నారు. గట్లపై గడ్డి కోసేటప్పుడు, నడిచేప్పుడు జాగ్రత్తలు పాటించాలి. పామాయిల్ తోటల్లో గెలలు కోసేటప్పుడు మరింత అప్రమత్తత అవసరం. వ్యవసాయ పంపుసెట్లు ఆన్, ఆఫ్ చేసేటప్పుడు వైర్లను గమనిస్తూ ఉండాలి. పంటను నాశనం చేస్తున్నాయని జంతువుల కోసం ఫెన్సింగ్‌కు తీగలు అమర్చుతున్నారు. ఇక్కడ పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి. 2024-25లో విద్యుత్తు ప్రమాదాల్లో 28 మరణాలు సంభవించాయి. వీటిలో 19 మరణాలకు సంబంధించి రూ.64 లక్షల పరిహారం చెల్లించారు. ఇంకా 9 కేసుల్లో రూ.36 లక్షలు చెల్లించాలి. 2025-26లో జనవరి నాటికి 30 మరణాలు సంభవించగా, వీటికి రూ.1.07 కోట్లు పరిహారం రావాలి. ఇప్పటికీ విడుదల చేయలేదు. అప్రమత్తంగా వ్యవహరించాలి

విద్యుత్తు విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. భవన నిర్మాణాలు చేసేటప్పుడు రహదారికి, ఇంటికి మధ్య 7 మీటర్లు సెట్ బ్యాక్ ఉండాలి. ఈ నిబంధనను ఉల్లంఘించడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎక్కడైనా తీగలు ఇంటికి సమీపంగా ఉన్నా, తెగిపడినా, స్తంభాలు పడిపోయే పరిస్థితిలో ఉన్నా టోల్‌ఫ్రీ నంబరు 1912కు సమాచారం అందించాలి.

**- జి.ప్రసాద్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, కాకినాడ సర్కిల్**

## 'ఉపాధి' బిల్లుల్లో ముందంజ



**కాకినాడ కలెక్టరేట్, :** న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విబి-జి రామ్ జిగా పేరు మార్పు చేయనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ కింద సమకూరిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, వీటి బిల్లులు ఎన్ఐసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తేనే సొమ్ములొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేసి, వీటి బిల్లులను అప్‌లోడ్ చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చూస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ద్వారా ఈ పనులు చేపట్టడంతో, ఈ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కాకినాడ జిల్లాపై ప్రత్యేక దృష్టిసారించారు. దీనికి అనుగుణంగా కలెక్టర్, డ్వామా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సమగ్రశిక్షా, పశుసంవర్ధకశాఖల అధికారులు పనులు పూర్తికి చొరవ తీసుకుంటున్నారు.

మరో నాలుగు రోజులే సమయం ఉండటంతో రాత్రి, పగలు బిల్లులు అప్‌లోడ్ చేసే పనిలో మండలస్థాయి కంప్యూటర్ సెంటర్లలో సిబ్బంది పనిచేస్తున్నారు. ః ఈ నెల 28లోగా మొత్తం పనులు పూర్తిచేసి, బిల్లులను నూరుశాతం అప్‌లోడ్ చేస్తామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి చెప్పారు.ః రూ.123.47కోట్ల మేర బిల్లులను ఎన్ఐసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, రాష్ట్రంలో రెండో స్థానంలో జిల్లాను నిలిపారు.

జిల్లాలో రూ.138.77 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో 1,208 పనులకు కలెక్టర్ పరిపాలనా ఆమోదం ఇవ్వగా, ఇప్పటికి 89 శాతం పనులు పూర్తి చేశారు.

# ఎంపీ, మాజీ సీఎం బృందానికి చేదు అనుభవం



**యానాం** పుదుచ్చేరి లోక్‌సభ ఎంపీ వి.వైథిలింగం, మాజీ సీఎం వి.నారాయణసామి బృందానికి దరియాలతిప్పలో చేదు అనుభవం ఎదురైంది. గత ఏడాది ఆగస్టు 22న జరిగిన గ్యాస్‌పైపులైన్ లీకేజీ, అగ్నిప్రమాదం నేపథ్యంలో తమకు పరిహారం ఇవ్వాలంటూ దరియాలతిప్ప, బాలయోగికాలనీ, సీతారాంనగర్, దొమ్మేటిపేట ప్రజలు 134 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. మంగళవారం యానాం పర్యటనకు వచ్చిన వైథిలింగం బృందం మాట్లాడేందుకు వారి వద్దకు వెళ్లగా నిరసన వ్యక్తమైంది. రెండు పర్యాయాలు వినతిపత్రాలు ఇచ్చిన ఈ అంశం గురించి పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదని మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు ఎంపీని నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీకి, గిడ్లకు మధ్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సీఎం, మల్లాడి ఏం చేస్తున్నారని వైథిలింగం ప్రశ్నించారు. ఆందోళనకారుల శిబిరం వద్ద ఎంపీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేయడంతో వారు వెనుతిరిగారు. గ్రామస్థుల నిరసన నేపథ్యంలో ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తమై వారిని నియంత్రించారు.

# సర్కారు నిర్లక్ష్యంపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం



**రాజమహేంద్రవరం:** టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కల్తీ సర్వసాధారణంగా మారిందని, ఈ ప్రభుత్వమే కల్తీదని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. పాలు, నీళ్లు, ఆహారం, మద్యం.. ఇలా అన్నింటా కల్తీ విలయ తాండవం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కల్తీ పాల బాధితులను మంగళవారం వారు పరామర్శించారు. అనంతరం కిమ్స్ బొల్లినేని ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతూ.. పాలనపై సీఎం చంద్రబాబు పట్టు కోల్పోయారన్నారు.

20 నెలల పాలనలో మొత్తం 36 కల్తీ ఘటనలు జరిగితే.. 900 మందికి పైగా ఆస్పత్రి పాలయ్యారని, 40 మంది చిన్నారులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి సంపాదనపై దృష్టిపెట్టిన చంద్రబాబు పాలనను పూర్తిగా గాలికొదిలేశారని, ఫలితంగానే కల్తీలతో నేరగాళ్లు రెచ్చిపోతున్నారని అన్నారు. మాజీ మంత్రులు విడదల రజిని, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, సీదిరి అప్పలరాజు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, పార్టీ నేత డాక్టర్ గూడూరు శ్రీనివాస్ ఏమన్నారంటే..

20 నెలల్లో 36 ఘటనలు

'కల్తీ పాల వ్యవహారంలో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోంది. 2024 జూలైలో తొలిసారి శ్రీకాకుళం కేజీబీవీ హాస్టల్‌లో డయేరియా ప్రబలినప్పుడే ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే ఇన్ని దారుణాలు జరిగేవి కావు. 20 నెలల్లో 36 ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యానికి పేదలే బలైపోతున్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో సింథటిక్ మిల్క్ తయారీ యూనిట్ వెలుగులోకి వచ్చినా కనీసం పట్టించుకోలేదు.

కల్తీ పాల ఘటనను డైవర్ట్ చేసి, ప్రభుత్వ వైఫల్యాలను పక్కదారి పట్టించడానికి ఎల్లో మీడియా రంగంలోకి దిగింది. ఇష్యూను డైవర్ట్ చేసేందుకు కూలెంట్ లీకేజీ అయిందంటూ కథనాలు అల్లుతోంది. రక్తం, పాల నివేదికలు రాక ముందే ఇలా ఎలా ప్రకటిస్తారు? మీరేమైనా సీసీ కెమెరాలో చూశారా? రాష్ట్రంలో 200 లక్షల లీటర్ల పాలు అనధికారంగా సరఫరా అవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ యాక్ట్ తీసుకొచ్చారు. కానీ, ఆ నిబంధనలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడం లేదు.

కూటమి ప్రభుత్వం కల్తీ మాటలతో అధికారంలోకి వచ్చింది. అందుకే పాలు, తిండి, నీరు, ఆఖరికి కల్తీ మద్యం.. ఇలా ప్రతిదాన్నీ కల్తీ చేస్తూ దోపిడీ చేసేవారి ఆగడాలు ఎక్కువైపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా డయేరియాతో 900 మంది ఆస్పత్రుల్లో చేరారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే ఎంతోమంది విద్యార్థులు చనిపోయారు. కల్తీ పాలతో అస్వస్థతకు గురైన బాధితులు రాజమహేంద్రవరం, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే వైద్యం నిరాకరిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు రూ.లక్షల ఫీజులతో దోపిడీ చేస్తున్నాయి.

రితిక్ అనే బాలుడిని కాపాడుకునేందుకు తల్లిదండ్రులు ఆస్పత్రిలో రూ.8.50 లక్షల బిల్లు కట్టాల్సి వచ్చింది. ఫిబ్రవరి 16 నుంచి కల్తీ పాల దారుణాలు వెలుగు చూసినా స్పందించాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రపోతోంది. బాధితులకు ఏకంగా డయాలసిస్ చేయాల్సిన దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఘోరంగా ఉందని అర్థమవుతోంది. రాజమహేంద్రవరం చరిత్రలో ఎప్పుడూ జరగని ఘోరం ఇది. ఏమవుతుందో తెలుసుకునే లోపే ఐదుగురు చనిపోయారు. ఎంతోమంది వెంటిలేటర్ల మీద చికిత్స పొందుతున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందించాలి. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి.

# బాబు సర్కార్ ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది: వైఎస్సార్‌సీపీ



**తూర్పుగోదావరి:** రాజమండ్రి కిమ్స్ హాస్పిటల్‌లో కల్తీ పాల బాధితులను వైఎస్సార్‌సీపీ నేతలు విడదల రజని, సీదిరి అప్పలరాజు, తానేటి వనిత, వేణుగోపాలకృష్ణ, మార్గాని భరత్, జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డాక్టర్ గూడూరు శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం మీడియాతో వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడారు.

**మెరుగైన వైద్యం అందించాలి: వేణుగోపాలకృష్ణ**

పాలలో కల్తీ జరిగి ఐదు ప్రాణాలు పోయాయి. ప్రతిపక్షం స్పందించిన తరువాతే ప్రభుత్వ స్పందించింది. ప్రజారోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టమైపోయింది. సంబంధిత మంత్రులు ఎవరూ ఇప్పటివరకు స్పందించలేదు. విషయం తెలిసిన వెంటనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... వైఎస్సార్ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఆసుపత్రిలో ఉన్న పేషెంట్లందరికీ పూర్తిస్థాయిలో వైద్యం అందించాలి. చనిపోయిన వారికి రూ.25 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలి. తిరుపతి లడ్డూ కల్తీ అనే మాట ద్వారా రాష్ట్రంలో చంద్రబాబు కల్తీకి తెర తీశారు. ఇంకా చాలామంది పేషెంట్లు ఉన్నారు. వారిని కూడా ఆస్పత్రిలో చేర్చి మెరుగైన వైద్యం అందించాలి.

ముందే ఎందుకు స్పందించలేదు?: విడదల రజని

కల్తీ మాటలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ఘటన 19 మంది బాధితులయ్యారు. ఐదుగురు చనిపోయారు. ఈ వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ నిలదీస్తే ప్రభుత్వ స్పందించింది. ప్రభుత్వానికి బాధ్యత ఉంటే ఎందుకు ముందే స్పందించలేదు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ నిద్రపోతుంది. రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ వ్యవస్థ పని చేస్తుందా?. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 900 మంది డయేరియాతో ఆసుపత్రుల్లో చేరారు. అనేక మంది చనిపోయారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ పూర్తిగా విఫలమైంది. కల్తీ పాలతో అనారోగ్యంతోనే రాజమండ్రి, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే వైద్యం దొరికే పరిస్థితి కనిపించలేదు.

రెయిన్‌బో ఆస్పత్రిలో రితిక్ అనే బాలుడికి సంబంధించి ప్రైవేట్ ఆస్పత్రిలో ఇప్పటివరకు వైద్యం కోసం ఎనిమిదిన్నర లక్షలు బిల్లు కట్టాల్సి వచ్చింది. మిగిలిన వారి పరిస్థితి ఏంటో ఒకసారి ఆలోచించండి. కల్తీ పాల వల్ల రీనల్ ఫెయిల్యూర్ జరిగింది. ఈ పరిస్థితికి ఎవరు బాధ్యత వహిస్తారు. చనిపోయిన వారికి పది లక్షలు ఇస్తారట.. ఏమూలాలకు సరిపోతుంది.

ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ఉపయోగకరంగా ఉంటాయని గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ 17 మెడికల్ కళాశాల ప్రారంభించారు. చంద్రబాబు తన వ్యాపారం స్కాముల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు.. ప్రజారోగ్యం గురించి పట్టించుకోవడం లేదు. తప్పు జరిగిందన్న విషయం వాళ్ళ మాటల్లోనే బయటపడింది. రాష్ట్రంలో అనేక హాస్టల్లో విద్యార్థులు కూడా బాధితులు అవుతున్నారు. హెరిటేజ్ విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకొచ్చాము ప్రజలన్నీ గమనిస్తున్నారు

**ఆరోగ్య శాఖ నిద్రపోతుంది..! కల్తీ పాల ఘటనపై రజిని**

**బాధితులకు అండగా ఉంటాం: తానేటి వనిత**

ఒకే ఫ్యామిలీకి చెందిన అనేకమంది బాధితులు ఆసుపత్రిలో చేరడంతో వైద్యులకు అనుమానం రావడంతోనే పాల కల్తీ వ్యవహారం బయటపడింది. బాధితులకు అండగా ఉంటాం. గత ప్రభుత్వ హయాంలో సమస్యలు వచ్చినప్పుడు ఆరోగ్యశ్రీ అండగా ఉండేది.

# రైల్వే శాఖ రక్షణ చర్యలు



**ఎలమంచిలి, విశాఖసమాచారం:** ఎలమంచిలి, రైల్వే ట్రాక్‌లను ఎక్కడపడితే అక్కడ మనుషులు, జంతువులు దాటకుండా వుండేందుకు, ప్రమాదాలను నివారించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు రక్షణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ట్రాక్‌లకు ఇరువైపులా రైల్వే శాఖకు చెందిన స్థలాన్ని ఆనుకొని క్రాష్ బారియర్లు (గార్డ్ రెయిల్స్), కాంక్రీట్ బారియర్లు ఏర్పాటు చేస్తున్నారు. చెన్నై- హౌరా మెయిన్ లైన్‌లో ప్రస్తుతం రెండు రైల్వే ట్రాక్‌లు వుండగా, పలుచోట్ల మూడో ట్రాక్ పనులు జరుగుతున్నాయి. మరోవైపు ఏటేటా పాసింజర్, సరుకు రవాణా రైళ్లు పెరుగుతున్నాయి. కొన్నిసార్లు రైల్వే గేటు వేసిన తరువాత వరుసగా రైళ్లు వస్తుండడంతో అర్ధగంట వరకు గేటు తీయని పరిస్థితి ఏర్పతున్నది. ఇక రైల్వే ట్రాక్‌లు అత్యధికంగా పొలాల మధ్య నుంచే వెళుతుంటాయి. వ్యవసాయ పనులకు వెళ్లే వారు, పశువులతోపాటు వాటి కాపరులు ఆయా ప్రదేశాల్లో రైల్వే ట్రాక్‌ను దాటుతుంటారు. కొన్నిచోట్ల రెండు రైల్వే ట్రాక్‌ల మధ్యనున్న ఖాళీ స్థలంలో పచ్చిగడ్డిని మేయడానికి పశువులు, మేకలు, గొర్రెలు వెళుతుంటాయి. ఈ క్రమంలో అత్యంత వేగంగా వచ్చే రైళ్లను గమనించి, తప్పుకునేలోపే ప్రమాదానికి గురవుతున్నారు. దీనివల్ల ఇటు ప్రాణనష్టం, అటు రైళ్లు ఆలస్యంగా నడవడం వంటివి జరుగుతున్నాయి. గత కొనేళ్ల నుంచి రైళ్ల వేగం కూడా బాగా పెరిగింది. ముఖ్యంగా వందే భారత్ రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల పైబడి వేగంగా దూసుకెళుతున్నాయి. దీంతో రైల్వే ట్రాక్‌లపై పశువుల కారణంగా ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. మరోవైపు రైల్వే స్థలాలకు కంచె, ప్రహరీ గోడలు వంటివి లేకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిని నివారించడానికి రైల్వే అధికారులు పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టారు. లెవెల్ క్రాసింగ్ గేట్లు వున్నచోట మినహా మరెక్కడా పశువులు రైల్వే ట్రాక్‌పైకి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. క్రాష్ బారియర్లు (గార్డ్ రెయిల్స్), కాంక్రీట్ బారియర్లు అమర్చుతున్నారు. అనకాపల్లి జిల్లాలో పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు పలుచోట్ల వీటి ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గురుకుల పాఠశాలకు బీరువా వితరణ

**-సహృదయం చాటుకున్న సీనియర్ జర్నలిస్ట్**
**-దుర్గమహంతి రామరావు..**
**-పాఠశాల అవసరాలకు బీరువా బహూకరణ..**
**-కృతజ్ఞతలుతెలిపిన ప్రిన్సిపాల్ సంధ్య, మరియు సిబ్బంది..**




**విశాఖపట్నం, విశాఖసమాచారం:** స్థానిక హయితి నగరంలో గల మహాత్మా జ్యోతి బాపులే ఆంధ్ర ప్రదేశ్ వెనుక బడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలకు శ్రీకాకుళం నగరానికి చెందిన కీ. శే.దుర్గమహంతి శ్రీనివాసరావు, హేమలత దంపతుల జ్ఞాపకార్థం వారి యొక్క కుమారుడు దుర్గమహంతి రామరావు (సీనియర్ జర్నలిస్ట్ ). లక్ష్మీ దంపతులు నూతన బీరువాను వితరణగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రామరావు మాట్లాడుతూ ఈ బీరువా పాఠశాల అవసరాలు నిమిత్తం సద్వినియోగం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలియజేయడం జరిగింది.. దీనికి గాను పాఠశాల ప్రిన్సిపాల్ పి. సంధ్య గారు మరియు పాఠశాల సిబ్బంది రామారావు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కట్టుకున్నవాడే యముడయ్యాడు




**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఆరిలోవ ప్రాంతంలో మరో దారుణం జరిగింది. దుర్గానగర్‌లో 14 రోజుల కిందట ఓ మహిళ దారుణ హత్యకు గురైన విషయం మరువక ముందే.. తాజాగా బాలాజీనగర్‌లో మరో హత్య చోటుచేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భార్య ప్రవర్తనపై అనుమానంతో భర్తే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 11వ వార్డు పరిధిలోని బాలాజీనగర్ సాయిబాబా ఆలయం సమీపంలో బి.దేవుడు, దుర్గ (33) దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ సిరిపురంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న దేవుడు.. తరచూ ఇంట్లో ఆమెతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంట్లోనే దుర్గను చున్నీతో గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ఆమె మెడకు ఉరితాడు బిగించి, ఇంటికి లోపలి నుంచి గడియ పెట్టి దాక్కున్నాడు. ఉదయం డ్యూటీకి వెళ్లాల్సిన దుర్గ.. తొమ్మిది గంటలైనా బయటకు రాకపోవడం, తలుపులు తెరవకపోవడంతో పెదగదిలికి చెందిన ఆమె స్నేహితురాలు పలుమార్లు ఫోన్ చేసింది. ఆమె స్పందించకపోవడంతో వెంటనే దుర్గ తండ్రికి సమాచారం ఇచ్చింది. ఆయన అక్కడికి చేరుకుని చూడగా తలుపులు లోపలి నుంచి గడియ పెట్టి ఉన్నాయి. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి.. ఆమె మెడకు తాడు బిగించి, కింద పడి ఉంది. దుర్గ ఉరి వేసుకుందని భావించిన తండ్రి.. స్థానికుల సాయంతో ఆమెను విమ్స్ ఆసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్ఐలు కృష్ణ, వరహాలు నాయుడు సాయంత్రం తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి బయట బైక్, లోపల సెల్‌ఫోన్ ఉండి, ఆ సమయంలో భర్త కనిపించకుండా పోవడంతో పోలీసులకు అతడిపై అనుమానం వచ్చింది. ఇంట్లో క్షుణ్ణంగా గాలించగా.. ఫ్రిజ్ వెనుక నక్కిన దేవుడు పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, భార్యపై అనుమానంతో తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# పదవీ విరమణ చేసిన ఉద్యోగికి సత్కారం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీలో ఐఎంసి డిపార్ట్మెంట్లో 32 సంవత్సరాల పాటు అటెండర్ గా పనిచేసే నేడు పదవీ విరమణ చేసిన ఏ . కాసులు కు వనమిత్ర సంఘ సభ్యులు శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాసులు చేసిన సేవలను ప్రతి ఒక్కరు కొనియాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఈశ్వరరావు, సూపరింటెడెంట్ పద్మరాజు, ఈవీఎల్ నరసింహం , ఎంవి రమణ, జి సంతోష్, రంగరాజు, వెంకటేశ్వర్లు, అప్పారావు శ్యాంబాబు, పోలారెడ్డి, అచ్యుతం ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# జిల్లాకు మరో భారీ కంపెనీ




**అనకాపల్లి, విశాఖసమాచారం:** అనకాపల్లి, జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. విశాఖ-చెన్నై కారిడార్‌లోని నక్కపల్లి క్లస్టర్‌లో భారీ, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తున్న కూటమి ప్రభుత్వం... అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలిలో కొత్త పరిశ్రమలు, కంపెనీలకు భూములు కేటాయిస్తున్నది. అదే విధంగా వివిధ రకాల రాయితీలను ప్రకటించి, ప్రోత్సాహాలను అందిస్తున్నది. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు భూ కేటాయింపులు జరిపారు. రాంబిల్లి మండలంలో రూ.8,175 కోట్ల భారీ పెట్టుబడులతో 'మెస్సర్స్ వారే ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ (డబ్ల్యూఈఎస్ఎస్‌పీఎల్) గ్రీన్‌ఫీల్డ్ లిథియం అయాన్‌సెల్ గిగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకోసం 300 ఎకరాలను కేటాయించింది. సంవత్సరానికి 16 గిగావాట్ పవర్ సామర్థ్యంతో లిథియం అయాన్‌సెల్ గిగాఫ్యాక్టరీతో పాటు బ్యాటరీ ఎనర్జీ సోరేజీ సిస్టమ్ (బీఈఎస్ఎస్) తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి రంగాలకు అవసరమైన విద్యుత్ నిల్వ సుదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కంపెనీలో ప్రత్యక్షంగా మూడు వేల మందికి, అనుబంధ రంగాల్లో పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.

బాలాజీ యాక్షన్ బిల్డ్‌వేస్‌కు పోత్సాహకాలు

రాంబిల్లి మండలంలో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వేస్ ప్రైవేటు లిమిటెడ్ (యాక్షన్ టెసా) ఏర్పాటు చేయనున్న ఎండీఆర్ బోర్డులు, ఇతర ఇంటరీయర్ సామగ్రి కంపెనీకి సంబంధించి ప్రోత్సాహకాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ సంస్థ పెట్టుబడికి సంబంధించి ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీని ప్రభుత్వం ఆమోదించింది. మొత్తం అర్హత పొందిన పెట్టుబడులపై రూ.1,233.15 కోట్ల మేర ప్రోత్సాహకాలు, రూ.1,500 కోట్ల వరకు ఉత్పాదక కార్యకలాపాలకు సంబంధించి సబ్సిడీ సౌకర్యం కల్పించేందుకు మంత్రివర్గం నిర్ణయించింది

# జీవితాంతం నిజాయితీగా ఉండాలి



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** అరకులోయ, ప్రకృతిని పూజించే మంచి వాతావరణంలో దైవాన్ని చూసే సనాతన ధర్మంలో మనమంతా పుట్టామని సనాతన ధర్మం, భగవద్గీత ప్రచారకర్త రాధా మనోహర్ దాస్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అరకులోయలో హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ గ్రౌండ్ నుంచి వేంకటేశ్వర కల్యాణ మండపం వరకు కోలాటం, ధింసా, భజనలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో రాధా మనోహర్‌దాస్ మాట్లాడుతూ, పరమతాల్లోకి వెళ్లకుండా జీవించినంత కాలం హిందువుగా, నిజాయితీగా వుండాలని పిలుపునిచ్చారు. మనమంతా భరతమాత కోసం ఈ గడ్డపై జన్మించిన వాళ్లమని, చివరకు వందేమాతరం అంటూ ప్రాణాలు వదిలేయాలని అన్నారు. అల్లూరి సీతారామరాజు పోరాటం, ప్రాణత్యాగం చేసిన నేలలో ఉన్న మనమంతా నిరంతరం ఆయనను స్మరించుకుంటూ, పౌరుషంతో బతకాలని పిలుపునిచ్చారు. హిందువులంతా నిజాయితీగా ధైర్యంతో వుండాలని, దేశానికి వ్యతిరేకంగా జరిగే కార్యకలాపాలు సాగించే వారికి దీటుగా సమాధానం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి దొన్నుదొర, సర్పంచ్ దాసుబాబు, తదితరులు పాల్గొన్నారు. గండికొట్టేవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు

కోరుతున్నారు. అరకులోయ, ప్రకృతిని పూజించే మంచి వాతావరణంలో దైవాన్ని చూసే సనాతన ధర్మంలో మనమంతా పుట్టామని సనాతన ధర్మం, భగవద్గీత ప్రచారకర్త రాధా మనోహర్ దాస్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అరకులోయలో హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ గ్రౌండ్ నుంచి వేంకటేశ్వర కల్యాణ మండపం వరకు కోలాటం, ధింసా, భజనలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో రాధా మనోహర్‌దాస్ మాట్లాడుతూ, పరమతాల్లోకి వెళ్లకుండా జీవించినంత కాలం హిందువుగా, నిజాయితీగా వుండాలని పిలుపునిచ్చారు. మనమంతా భరతమాత కోసం ఈ గడ్డపై జన్మించిన వాళ్లమని, చివరకు వందేమాతరం అంటూ ప్రాణాలు వదిలేయాలని అన్నారు. అల్లూరి సీతారామరాజు పోరాటం, ప్రాణత్యాగం చేసిన నేలలో ఉన్న మనమంతా నిరంతరం ఆయనను స్మరించుకుంటూ, పౌరుషంతో బతకాలని పిలుపునిచ్చారు. హిందువులంతా నిజాయితీగా ధైర్యంతో వుండాలని, దేశానికి వ్యతిరేకంగా జరిగే కార్యకలాపాలు సాగించే వారికి దీటుగా సమాధానం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి దొన్నుదొర, సర్పంచ్ దాసుబాబు, తదితరులు పాల్గొన్నారు. గండికొట్టేవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# 11 రోజుకి చేరిన అతిథి ఆధ్యాపకుల నిరసన దీక్ష



**విశాఖపట్నం (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీలోని అతిథి ఆధ్యాపకుల నిరసన దీక్ష ఈరోజుకి 11 రోజుకి చేరింది ముఖ్యంగా రోజువారి వేతనం సుమారుగా 160 రూపాయలుగా ఉండటంతో జీవనోపాధి అతిథి అధ్యాపకులకు జీవనోపాధి కష్టతరమైనది. ఉపాధి హామీ పథకం కన్నా చాలా తక్కువగా ఉండటం విశేషం. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలో మాదిరిగా మరియు ఆంధ్ర యూనివర్సిటీ శత జయంతి సందర్భంగా నెలవారి జీతాలు ఇచ్చి పండగ వాతావరణం నెలకొల్పాలని ఆంధ్ర యూనివర్సిటీ అధికారులను కోరడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సురేష్ మీనన్ , త్రినాధ్, పవన్ శేషు ,ఫణి ,రజిని, దివ్య, ప్రసాద్, కోమలి,సునీత తదితరులు పాల్గొన్నారు

# ప్రాజెక్టు సారథి



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు అమలుచేయనున్న 'ప్రాజెక్టు సారథి'ని నెల రోజుల్లో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ జీవీఎంసీ, పోలీస్ అధికారులను ఆదేశించారు. 'ప్రాజెక్టు సారథి' అమలుపై జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో జీవీఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులకు సవివరంగా కమిషనర్ వివరించారు. నగరంలో ట్రాఫిక్ పెరగడం వల్ల ప్రజా జీవనానికి ఇబ్బంది కలగడంతోపాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన జీవన వసతులను కల్పించడంలో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో సిస్టమేటిక్ అగ్మెంటెడ్ రేడియల్ ట్రాఫిక్ అండ్ హూప్ ఇండక్షన్ (ఎస్ఏఆర్‌టీహెచ్ఐ) అమలు చేసేందుకు 'ప్రాజెక్టు సారథి'కి రూపకల్పన చేశామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నగరంలో 90 కూడళ్లలో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్), 101 జంక్షన్‌లలో అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తామన్నారు. వీటిని జీవీఎంసీ కార్యాలయంలో ఉన్న సిటీ ఆపరేషన్స్ సెంటర్ (కమాండ్ కంట్రోల్‌సెంటర్)కు అనుసంధానం చేస్తామన్నారు. ఈ సిస్టమ్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వయలేషన్ డిటెక్షన్ చేసి ఆటోమేటిక్‌గా జరిమానా విధిస్తూ వాహన యజమానికి ఈ-చలాన్ జారీ అవుతుందన్నారు. అలాగే నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు సజావుగా సాగిపోయేలా ఏటీసీఎస్ ద్వారా ట్రాఫిక్ సిగ్నల్ సింక్రనైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. వాహనాల రద్దీకి అనుగుణంగా గ్రీన్‌సిగ్నల్ ఆటోమేటిక్‌గా ఇండికేట్ అవుతుందన్నారు. ప్రముఖుల రాకపోకల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా గ్రీన్‌సిగ్నల్ వచ్చేలా సిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. దీనివల్ల ప్రజలకు ట్రాఫిక్ సమస్య తొలగడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్టపడుతుందన్నారు. ఈ ప్రాజెక్టు అమలు కోసం ఇప్పటికే టెండర్లు ఆహ్వానించామన్నారు. టెండర్లలో మూడు ఏజెన్సీలు పాల్గొన్నాయని, అవన్నీ ఫైనాన్స్ బిడ్‌కు అర్హత సాధించాయన్నారు. ఆయా ఏజెన్సీలతో ఇప్పటికే నగరంలో మూడు కూడళ్లలో పైలట్ ప్రాజెక్ట్‌గా నెల రోజులుపాటు ఆయా విధానాలను అమలు చేసి ఉత్తమ ఫలితాలు వచ్చినట్టు నిర్ధారించామన్నారు. ప్రాజెక్టును వీలైనంత వేగంగా పట్టాలెక్కించేందుకు టెండర్‌లో తదుపరి దశకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, చీఫ్ ఇంజనీర్ పీవీవీ సత్యనారాయణరాజు, వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# పివిటిజీలకు మంజూరైన బిల్లులు వెంటనే విడుదల చేయాలి...



**అరకులోయ (విశాఖ సమాచారం):** పి వి టి జి లకు మంజూరైన పీఎం జన్మన్ హౌసింగ్ ఇల్లును పెంచిన లక్ష రూపాయలు తక్షణమే విడుదల చేయాలని బస్కి పంచాయతీలో విస్తృతన ప్రచారం చేయడం జరిగిందని అనేక దశబ్దల కాలం నాటి నుండి అభివృద్ధికి దూరంగా ఉన్న పీవీటి జి లకు సమగ్ర అభివృద్ధి చేయాలని అనేక పోరాటాల ఫలితంగా మంజూరు అయిన పీఎం జన్మన్ ఇల్లులు బిల్లులు లేక పునాది స్థాయిలో గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ ఇల్లులు నిర్మాణం కోసం కేటాయించిన నిధులు సరిపోక మార్మల ప్రాంతాలకు ఇల్లులు నిర్మించాలంటే చాలా కష్టంగా ఉంటుంది రోడ్డు లేక రవణ సౌకర్యం లేక ఇసుక లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇసుక సరపర చేయడం లేదు ఒక్కొక్క ఇల్లు నిర్మాణానికి సుమారు పది లక్షలు ఖర్చు అవుతుంది. గ్రామీణ ప్రాంతంలో ఇల్లు స్థలాలు లేక అనేకమంది పి వి టిజిలు ఇల్లులు నిర్మించుకోలేకపోతున్నారు ఇటువంటి పరిస్థితుల్లో పెంచిన లక్ష రూపాయలు లబ్ధిదారులకు అందకపోవడం దారుణం పెంచిన లక్ష రూపాయలు ఇవ్వాలని ఈనెల 27వ తేదీన చలో ఐటిడిఏ పాడేరు కార్యక్రమం గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరుగుతుంది తక్షణమే స్పందించి పివిటి జి లకు పెంచిన లక్ష రూపాయలు విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు బురిడీ దశరథ్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు గ్రామస్తులు ఉన్నారు.

# అతిథి అద్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా



**విశాఖపట్నం (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీలో గత 10 రోజులుగా అతిథి అధ్యాపకులు తమకు నెలవారి జీతాలు ఇవ్వాలని నిరసన దీక్షలు చేపట్టడం తెలిసిందే. అందులో భాగంగా నేడు రిజిస్టర్ కార్యాలయం ముందు పలువురు అతిథి అద్యాపకులు నిరసన దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముసుగు ప్రసాద్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా అతిథి అధ్యాపకులుగా అరకొర జీతాలతో పని చేస్తున్నామని, పలుసార్లు వినతి పత్రాలను ప్రభుత్వ అధికారులకు, మంత్రులకు ఇచ్చామని వారు ఏ విధమైన స్పందన తెలియజేయడం లేదని పేర్కొన్నారు . ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ అధికార యంత్రాంగం చర్చలకు పిలిచి ఏ విధమైన హామీ ఇవ్వలేదని తెలియజేశారు. ప్రభుత్వ జీవో 110 ప్రకారం నెలకు ఏబై వేలు జీతం ఇవ్వాలని లేదా యుజిసి నిబంధనల ప్రకారం ఒక అవర్కు 1500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతిథి అధ్యాపకుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ , రెక్టర్లకు వినతి పత్రాలను సమర్పించామని తెలియజేశారు. .మా సమస్యలు తక్షణం పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలియ జేశారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకుల సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ సురేష్ మీనన్, డా.ఫణీ, డా.కళ్యాణీ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా సినిమా సమాచారమ్

## గ్లామర్ కన్నా గ్రేస్ కే.. కవర్ పేజీపై వావ్ అనేలా సామ్

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు.. ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. తాజాగా ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ వోగ్ ఇండియా మార్చి నెల కవర్ పేజీకి ఆమెను ఎంపిక చేయడం విశేషం.. తాజాగా విడుదలైన కవర్ ఫోటోలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి. అభిమానులతో పాటు ఫ్యాషన్ ప్రియులు కూడా ఆ పిక్స్ ను తెగ షేర్ చేస్తున్నారు.
అయితే వోగ్ ఇండియా ఫొటోషూట్ లో సమంత రెండు భిన్నమైన లుక్స్ లో కనిపించారు. ఆరెంజ్ కలర్ సెమీ మోడ్రన్ డ్రెస్ లో స్టైలిష్ గా, బ్లాక్ టైట్ ఫిట్ డ్రెస్ లో క్లాసీగా మెరిశారు. సింపుల్ మేకప్, నేచురల్ ఎక్స్ప్రెషన్స్, కాన్ఫిడెంట్ పోజెస్ ఆమెకు మరింత అందం తీసుకొచ్చాయి. గ్లామర్ కంటే గ్రేస్ కు ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆ ఫోటో షూట్ లో క్లియర్ గా కనిపిస్తోంది.
కవర్ స్టోరీలో భాగంగా సమంత తన లైఫ్ జర్నీ గురించి మనసు విప్పి మాట్లాడింది. "జీవితంలో పడిపోతే అందరూ చూస్తారు. అది పబ్లిక్ అవుతుంది" అంటూ చేసిన కామెంట్స్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. వ్యక్తిగత జీవితంలో ఎదురైన సమస్యలు, విడాకులు, ఆరోగ్య ఇబ్బందులు, సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలు అన్నీ తన ముందే జరిగాయని తెలిపింది.
అయితే ఆ కష్టాలు తనను మరింత స్ట్రాంగ్ గా మార్చాయని సమంత చెప్పింది. మొదట్లో బాధ కలిగినా, ఆ తర్వాత మెంటల్ గా స్ట్రాంగ్ గా మారానని వెల్లడించింది. ఇప్పుడు ప్రశంసలు




వచ్చినా, విమర్శలు వచ్చినా పెద్దగా ప్రభావం చూపవని స్పష్టం చేసింది. తనపై నమ్మకం పెరిగిందని చెప్పిన సామ్.. ఫిట్ నెస్ పై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు వెల్లడించడం విశేషం.


## వెంకీ ఆలోచనలో లాజిక్ కనిపిస్తుందిగా!



టాలీవుడ్‌లో రీమేక్‌ల ట్రెండ్ ను ఒకప్పుడు సేఫ్ జోన్‌గా భావించేవారు. హిట్ అయిన సినిమా కథను తీసుకుని దాన్ని ఇక్కడి నటీనటులతో తెరకెక్కిస్తే మినిమమ్ గ్యారెంటీ అనే నమ్మకముండేది. కానీ గత రెండు మూడేళ్లుగా ఆ ఈక్వేషన్ మారిపోయింది. ఈ నేపథ్యంలోనే విక్టరీ వెంకటేష్ గతంలో తీసుకున్న తన నిర్ణయాన్ని మార్చుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే దృశ్యం సిరీస్ నుంచి రెండు సినిమాలు రాగా, ఆ రెండు సినిమాలూ మంచి సక్సెస్ ను అందుకున్నాయి. ఈ రెండు సినిమాలనీ తెలుగులో వెంకటేష్ తోనే రీమేక్ చేశారు. ఇప్పుడు మలయాళంలో దృశ్యం3 తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను కూడా తెలుగులో వెంకీతోనే చేయాలనే ప్లాన్స్ ఉన్నప్పటికీ, వెంకీ దానిపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. చాశ్రీంశీ =ఖుం – గ్లామర్ కన్నా గ్రేస్ కే.. కవర్ పేజీపై వావ్ అనేలా సామ్ మలయాళ వెర్షన్ థియేటర్లలో రిలీజైన కొన్నాళ్లకే ఓటీటీలో అందుబాటులోకి రానుండటంతో, అదే కథను మళ్లీ థియేటర్లలో చూడ్డానికి ఆడియన్స్ ఇంట్రెస్ట్ చూపించకపోవచ్చని ఆయన భావిస్తున్నారు. ఇటీవల కాలంలో రీమేక్ సినిమాల పరిస్థితిని చూస్తే వెంకీ ఆలోచనలో లాజిక్ ఉందనిపిస్తుంది. భీమ్లా నాయక్ లాంటి కొన్ని రీమేక్స్ స్టార్‌డమ్ వల్ల మంచి ఓపెనింగ్స్ ను సాధించినా, గాడ్ ఫాదర్ లాంటి సినిమాలు మిక్స్డ్ టాక్ తో సరాసరి ఫలితాలకే పరిమితమైన సంగతి తెలిసిందే. చాశ్రీంశీ =ఖుం – ఎవరికైనా అది కామన్.. ప్రభాస్ స్పీడ్ మాత్రం తగ్గేదేలే.. పైగా ఓటీటీలో ఆల్రెడీ చూసిన కథను మళ్లీ థియేటర్ కు వెళ్లి చూడాలనే ఇంట్రెస్ట్ ఆడియన్స్ లో కూడా తగ్గిపోయింది. మరోవైపు వెంకీ కెరీర్ ను చూసుకుంటే, ఆయన రీమేక్‌లు చేసినా అందులో కూడా బాగానే సక్సెస్‌లు అందుకున్నారు. అయినప్పటికీ వెంకీ ప్రస్తుతమున్న ట్రెండ్‌కు తగ్గట్టుగా మార్పులు చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు అనిపిస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ తో మంచి ఫామ్ లో ఉన్న వెంకీ, ప్రస్తుతం సేఫ్ గేమ్ కంటే ఫ్రెష్ కంటెంట్ అయితేనే బెటర్ అని, దాని వైపే మొగ్గు చూపుతున్నట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆదర్శ కుటుంబం చేస్తున్న వెంకీ, అనిల్ రావిపూడితో తన తర్వాతి సినిమా కోసం చర్చలు జరుపుతున్నారని, సంక్రాంతి సీజన్ ను టార్గెట్ చేస్తూ ఫుల్ లెంగ్త్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ తో రావాలనే ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. రీమేక్ కథతో రిస్క్ చేయడం కంటే, తన ఇమేజ్ కు తగ్గ ఎంటర్టైనర్ తో రావడమే బెటర్ అని వెంకీ ఆలోచిస్తున్నారని తెలుస్తోంది.

## బాఫ్టా వేడుకల్లో అలియా అందాలు..

ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ బాలీవుడ్ లో తన ప్రయాణాన్ని మొదలుపెట్టి.. నేడు హాలీవుడ్ స్థాయిలో పాపులారిటీ సొంతం చేసుకుంది.. అలాంటి ఈమె బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిలిం అండ్ టెలివిజన్ ఆర్ట్స్ (బాఫ్టా) అవార్డు వేడుకలలో సందడి చేసింది. ఫిబ్రవరి 22న జరిగిన ఈ అవార్డుల ప్రధానోత్సవంలో ప్రెజెంటర్ గా వ్యవహరించే అరుదైన గౌరవాన్ని అందుకుంది. తొలిసారి ఈ అంతర్జాతీయ వేడుకకు హాజరైన రెడ్ కార్పెట్ పై తన అందాలతో హొయలు పోయింది. ముఖ్యంగా తన గ్లామర్ టచ్ తో అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేసింది ఈ ముద్దుగుమ్మ. బాఫ్టా 2026 అవార్డు వేడుకల్లో భాగంగా ప్రముఖ డిజైనింగ్ సంస్థ గూచీ తయారుచేసిన కస్టమ్ సిల్వర్ సీక్విడ్ గౌన్ ధరించింది. ఈ డ్రెస్ రెడ్ కార్పెట్ పై ఈమె కాంతిని రెట్టింపు చేసిందనే చెప్పాలి. ఇక వెచ్చగా ఉండడానికి లైట్ ర్యాప్ ను కూడా జోడించింది. చక్కని జుట్టు.. మృదువైన మేకప్ తో తన స్టైలింగును చాలా సున్నితంగా డిజైన్ చేసుకుంది. లుక్ క్లాసిగా ఉన్నప్పటికీ సౌకర్యవంతమైన దుస్తులతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. చాశ్రీంశీ =ఖుం – ఎవరికైనా అది కామన్.. ప్రభాస్ స్పీడ్ మాత్రం తగ్గేదేలే.. ఇకపోతే తన అందాన్ని మరింత ఫుల్ ఫీల్ చేసుకోవడానికి బరువైన షిమ్మర్ ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా ఇంత పెద్ద అంతర్జాతీయ కార్యక్రమానికి తన అందంతో.. హుందాతనంతో అభిమానులను చూపు తిప్పుకోనివ్వకుండా చేసింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం బాఫ్టా వేడుకలకు సంబంధించిన ఆలియా లుక్ ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తోంది. ఇకపోతే ఇదే వేడుకల్లో అలియా భట్ చేసిన కామెంట్లు కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అలియా భట్ మాట్లాడుతూ.. ఇండస్ట్రీకి రావాలన్నది నా చిన్ననాటి కల. సినిమాల్లో నటించడం కోసమే నేను పుట్టానేమో అనిపిస్తుంది.. కెమెరా ముందు నిలుచున్నప్పుడు ఏదో తెలియని ఆనందం.. ఈ పరిశ్రమకు రావడం నిజంగా ఒక వరం.. నటన అనేది నా



బాధ్యత...దానిపట్ల ఎప్పుడూ కూడా నేను కృతజ్ఞతతోనే ఉంటాను. సినిమాను ఎంజాయ్ చేయడానికి భాష అవసరం లేదు.. ఎందుకంటే సినిమాను నడిపించేది భాష కాదు భావోద్వేగం.. ముఖ్యంగా నా కుమార్తె రాహా నాలో ఎంతో స్ఫూర్తిని నింపుతోంది. నా పాటలకు తను డాన్స్ చేస్తున్నప్పుడు ఆ ఆనందం మరింత రెట్టింపు అవుతుంది" అంటూ ఆలియా తెలిపింది. మొత్తానికైతే బాఫ్టా వేడుకల్లో తొలిసారి ప్రజెంటర్గా పాల్గొని తన అదృష్టాన్ని పరీక్షించుకున్న ఈమె అక్కడ తన అందంతో ఆకట్టుకుంది. అంతేకాదు సినిమాపై తనకున్న అభిప్రాయాన్ని పంచుకొని స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది అలియా భట్.

## ఐపీఎల్ టీమ్ లోగో చాలా పవర్ ఫుల్ గా ఉందండోయ్

ప్రస్తుతం టీ20 వరల్డ్ కప్ రసవత్తరంగా సాగుతోంది. సెమీఫైనల్స్ బెర్త్ కోసం ఎనిమిది జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఇంగ్లాండ్ తన బెర్త్ ను కన్ఫర్మ్ చేసుకోగా.. మిగిలిన మూడు స్థానాల కోసం ఏడు జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటోన్నాయి. దీనికి భారత్ కూడా మినహాయింపు కాదు. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్ లో 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం టీమిండియా సెమీ ఫైనల్స్ ఆశలను అడుగంటేలా చేసింది. దీని తర్వాత ఐపీఎల్ సందడి ఆరంభమౌతుంది. ఇప్పటికే ఆక్షన్ వ్యవహారం ముగిసింది. మొత్తం 10 జట్లు పోరాటానికి ఐపీఎల్ టైటిల్ పోరు కోసం సమాయాత్తమౌతోన్నాయి. ఈ పరిణామాల మధ్య లక్నో సూపర్ జెయింట్స్ సరికొత్త రూపాన్ని సంతరించుకుంది. ఈ ఐపీఎల్ సీజన్ కోసం ఓ కొత్త లోగోను ఆవిష్కరించింది. ఉత్తరప్రదేశ్, లక్నో సంస్కృతిని ప్రతిబింబించేలా దీన్ని రూపొందించిందా టీమ్. ఆరంభం నుండి అండగా నిలిచిన అభిమానుల స్ఫూర్తికి అద్దం పడుతుందని తెలిపింది. ఈ లోగోలో– గరుడ, కిరీటం, ఏనుగు.. ప్రధానంగా కనిపిస్తాయి. వేగం, రాజసం, శక్తికి ఈ మూడూ ప్రతీకలు. గరుడ ధైర్యాన్ని సూచిస్తుంది. వేగంగా పైకి లేచే ధైర్యం, సవాళ్లను ఎదుర్కొనే తెగువ, ఎప్పుడూ వెనుకంజ వేయని తత్వాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. సూపర్ జెయింట్స్ కూడా ప్రతి మ్యాచ్ లో ఇలాగే ఆడుతుందని ఓడిపోయే పరిస్థితుల్లోనూ వేగంగా పైకి లేచే వైఖరికి గరుడ నిదర్శనమని ఎల్ఎస్జీ పేర్కొంది. కిరీటం– రాజసానికి, గౌరవానికి చిహ్నం. జట్టు మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ మిలియన్ల మంది ఆశలను మోస్తుంది. ఈ జెర్సీని ధరించడం ఒక గౌరవమని పేర్కొంది ఫ్రాంఛైజీ. కోట్లాదిమంది అభిమానులు ఇచ్చే గౌరవం అనే కిరీటాన్ని




ఎప్పుడూ కోల్పోకూడదనే ఉద్దేశంతో దీన్ని లోగోలో చేర్చినట్లు తెలిపింది. ఏనుగు– బలం, తెలివితేటలు, సహనం, ఐక్యతకు ప్రతీక. ఎల్ఎస్జీ జట్టును ఇది అచ్చంగా ప్రతిబింబిస్తుందని ఫ్రాంఛైజీ వివరించింది. ఏనుగులో ఈ నాలుగు లక్షణాలు తమ జట్టు, ప్లేయర్ల మధ్య ఉన్నాయని పేర్కొంది. ఏనుగులా ఎటువంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ చెక్కుచెదరని అభిమానం తమ సొంతమని తెలిపింది. ఐపీఎల్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ లో– ఎయిడెన్ మార్క్రామ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్, రిషబ్ పంత్, ఆయుష్ బదోని, అబ్దుల్ సమద్, ఆవేశ్ ఖాన్, మహ్మద్ షమీ, మయాంక్ యాదవ్, దిగ్వేష్ రాథీ, ఆకాష్ సింగ్, అర్జున్ టెండూల్కర్, అర్షిన్ కులకర్ణి, హిమ్మత్ సింగ్, ఎం. సిద్ధార్థ్, మాథ్యూ బ్రీట్జ్‌కే, మోహ్సిన్ ఖాన్, ప్రిన్స్ యాదవ్, షాబాజ్ అహ్మద్ ఉన్నారు.

## సెంచరీ వెనుక మాస్టర్ మైండ్.. బయటపెట్టిన హ్యారీ

టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా పాకిస్థాన్ తో జరిగిన సూపర్–8 మ్యాచ్ లో ఇంగ్లాండ్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. అనంతరం 165 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 19.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించడం గమనార్హం. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (100, 51 బంతుల్లో) అద్భుతమైన సెంచరీతో జట్టుకు విజయాన్ని అందించాడు. హ్యారీ బ్రూక్ తన మెరుపు ఇన్నింగ్స్‌తో పాకిస్థాన్‌ను మట్టికరిపించిన తర్వాత తన సక్సెస్ సీక్రెట్‌ను పంచుకున్నాడు. ఇంగ్లండ్‌ను టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు చేర్చిన కెప్టెన్ హ్యారీ బ్రూక్ తన సక్సెస్ క్రెడిట్‌ను కోచ్ బ్రెండన్ మెకల్లమ్ (బాజ్)కు ఇచ్చాడు. మ్యాచ్ అనంతరం బ్రూక్ మాట్లాడుతూ.. బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు, తన రికార్డులపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు.
సాధారణంగా లోయర్ ఆర్డర్‌లో వచ్చే బ్రూక్.. ఈ మ్యాచ్‌లో అనూహ్యంగా మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. దీనిపై స్పందిస్తూ.. "మేము ఇక్కడికి వచ్చింది సెమీస్‌కు చేరాలనే లక్ష్యంతో, ఆ పని పూర్తి చేశాం. నేను నంబర్ 3లో రావాలనేది మా కోచ్ బాజ్ మాస్టర్ మైండ్ ప్లాన్. ఈ రోజు ఉదయం అతను నా దగ్గరకు వచ్చి.. పవర్‌ప్లేను మనం మరింత సమర్థవంతంగా వాడుకోవాలి, నీకు ఎలాగో అటాకింగ్ గేమ్ అంటే ఇష్టం కదా అని చెప్పాడు. అదృష్టవశాత్తూ ఆ ప్లాన్ వర్కవుట్ అయ్యింది" అని బ్రూక్ తెలిపాడు. పాకిస్థాన్‌పై బ్రూక్‌కు ఉన్న అద్భుతమైన రికార్డును కోచ్ గుర్తు చేశాడట. "ఈ రోజు ఉదయం బాజ్ నాతో మాట్లాడుతూ.. 'పాకిస్థాన్ నీ ఫేవరెట్ టీమ్ కదా, మూడో స్థానంలో వెళ్తే ఏమంటావు?' అని అడిగాడు. నేను కూడా గత కొంతకాలంగా ప్రమోషన్ గురించి




ఆలోచిస్తున్నాను, అందుకే వెంటనే ఒప్పుకున్నాను. మొత్తానికి ప్లాన్ సక్సెస్ అయ్యి మంచి ఫలితం వచ్చింది" అని బ్రూక్ నవ్వుతూ చెప్పుకొచ్చాడు.
ఇంగ్లండ్ బౌలింగ్‌ను మెచ్చుకుంటూ.. "టీ20ల్లో మంచి స్టార్ట్ రావడం చాలా ముఖ్యం. జోఫ్రా ఆర్చర్ ఆరంభంలోనే వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే మ్యాచ్ ముగిసే సమయంలో కొంచెం టెన్షన్ పడ్డాను. భారత్‌తో ఓవల్ మైదానంలో జరిగిన మ్యాచ్ ఫలితం (ఓటమి) మళ్ళీ రిపీట్ అవుతుందేమోనని భయమేసింది. కానీ చివరికి గెలిచినందుకు సంతోషంగా ఉంది" అని బ్రూక్ అన్నాడు. టాప్ ఆర్డర్‌లో మార్పులపై స్పందిస్తూ.. "దీని గురించి నేను, బాజ్ చర్చించాల్సి ఉంది. ప్రస్తుతానికి పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు, కానీ పరిస్థితులను బట్టి ఏదైనా జరగొచ్చు" అని బ్రూక్ ముగించాడు.

## మహిళల టీ20 ప్రపంచకప్ షెడ్యూలు విడుదల

జూన్ 14న పాకిస్థాన్‌తో పోరుతో భారత జట్టు మహిళల టీ20 ప్రపంచకప్ టైటిల్ వేటను ఆరంభించనుంది. ఇంగ్లాండ్ ఆతిథ్యమిచ్చే ఈ టోర్నీ షెడ్యూలును ఐసీసీ.. మంగళవారం ప్రకటించింది. జూన్ 12 నుంచి జులై 5 వరకు జరిగే ప్రపంచకప్‌లో 12 జట్లు పోటీపడనున్నాయి. పాకిస్థాన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌లతో పాటు భారత్ గ్రూప్–1లో ఉంది. వెస్టిండీస్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు గ్రూప్–2లో పోటీపడతాయి. టోర్నీ తొలి మ్యాచ్‌లో జూన్ 12న ఎడ్జ్‌బాస్టన్‌లో శ్రీలంకతో ఆతిథ్య ఇంగ్లాండ్ తలపడుతుంది. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ కూడా ఎడ్జ్‌బాస్టన్‌లోనే జరుగుతుంది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌ల్లో జూన్ 17న నెదర్లాండ్స్‌తో, 21న దక్షిణాఫ్రికాతో, 25న బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో 28న ఆస్ట్రేలియాను ఢీకొంటుంది. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశిస్తాయి. జూన్ 30, జులై 2న సెమీఫైనల్స్ జరుగుతాయి. జులై 5న ఫైనల్‌కు లార్డ్స్ ఆతిథ్యమిస్తుంది.



## సెమీస్‌లో ఇంగ్లాండ్

బ్రూక్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడంతో ఇంగ్లాండ్ టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఫర్హాన్ (63; 45 బంతుల్లో 7ఐ4, 2ఐ6) మెరవడంతో మొదట పాకిస్థాన్ 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. డాసన్ (3/24), ఓవర్టన్ (2/26), ఆర్చర్ (2/32) పాక్‌ను కట్టడి చేశాడు. బ్రూక్ (100; 51 బంతుల్లో 10ఐ4, 4ఐ6) అద్భుత శతకం సాధించడంతో లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 19.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంగ్లాండ్ తన తొలి సూపర్ 8 పోరులో శ్రీలంకపై గెలిచిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరడం ఇంగ్లాండ్‌కు ఇది వరుసగా అయిదోసారి. అతడి పోరాటమే ఇంగ్లాండ్‌ను విజయతీరాలకు చేర్చింది. ఆ జట్టుకు ఆరంభం పెద్ద షాక్. తొలి బంతికే సాల్ట్ ఔటయ్యాడు. ఆ తర్వాత బట్లర్ (2), బెతెల్ (8) కూడా ఎక్కువసేపు నిలువలేదు. ఇంగ్లాండ్ 35/3తో చిక్కుల్లో పడింది. అయితే మరో వైపు నుంచి వికెట్లు పోతున్నా బ్రూక్ ధాటిగా బ్యాటింగ్ చేస్తూ పరుగుల వేటను కొనసాగించాడు. ఎనిమిదో ఓవర్లో జట్టు స్కోరు 58 వద్ద బ్యాంటన్ (2) కూడా ఔట్ కావడంతో ఇంగ్లాండ్‌పై ఒత్తిడి పెరిగింది. అయినా బ్రూక్ పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. సామ్ కరన్ (16)తో కలిసి జట్టు స్కోరును 100 దాటించాడు. కానీ 12వ ఓవర్లో కరన్‌ను తారిఖ్ ఔట్ చేయడంతో భాగస్వామ్యం విడిపోయింది. పాకిస్థాన్‌కూ మంచి అవకాశమున్న దశ అది. కానీ బ్రూక్‌కు తోడు జాక్స్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో ఇంగ్లాండ్ వేగంగా లక్ష్యం దిశగా సాగింది. 48 బంతుల్లో 61 పరుగులు చేయాల్సిన స్థితి నుంచి ఆఖరి నాలుగు ఓవర్లలో 27 పరుగులు చేయాల్సిన స్థితికి చేరుకుంది. ఆపై 17వ ఓవర్లో జాక్స్ ఓ ఫోర్ బాదగా.. బ్రూక్ వరుసగా 6, 4 దంచేసి శతకం (50 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. 19 బంతుల్లో 10 పరుగులు చేయాల్సిన స్థితిలో ఇంగ్లాండ్ గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ ఆ జట్టు అనూహ్యంగా తడబడింది. 17వ ఓవర్ ఆఖరి బంతికి బ్రూక్ వెనుదిరగడం, 18వ ఓవర్లో మీర్జా 5 పరుగులే ఇవ్వడం, 19వ ఓవర్లో నవాజ్.. 2 పరుగులే ఇచ్చి జాక్స్, ఓవర్టన్‌లను ఔట్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. ఆఖరి ఓవర్లో ఇంగ్లాండ్ మూడు పరుగులే చేయాల్సివున్నా.. చేతిలో ఉన్నది రెండు వికెట్లే. ఆ స్థితిలో 20వ ఓవర్ తొలి బంతికి ఫోర్ కొట్టి.. ఆర్చర్ ఇంగ్లాండ్‌ను సంబరాల్లో ముంచెత్తాడు.
నిలిచిన ఫర్హాన్: ఓపెనర్ ఫర్హాన్ కీలక ఇన్నింగ్స్ ఆడడంతో అంతకుముందు పాకిస్థాన్ పోటీ ఇవ్వదగ్గ లక్ష్యాన్ని నిర్దేశించింది. సూపర్ ఫామ్‌ను కొనసాగించిన ఫర్హాన్.. మరో అర్ధశతకం సాధించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్‌కు ఆరంభంలో గట్టి దెబ్బే తగిలింది. ఇంగ్లాండ్ పేసర్ల ధాటికి ఆ జట్టు 27 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ సయిమ్ అయూబ్ (7)ను ఆర్చర్.. కెప్టెన్ సల్మాన్ ఆఘా (5)ను ఓవర్టన్ వెనక్కి పంపారు. ఆ దశలో ఫర్హాన్ నిలబడ్డాడు.




బాబర్ అజామ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. కానీ తొలి పది ఓవర్లలో అతడు తన దూకుడును నియంత్రించుకోవాల్సి వచ్చింది. మరోవైపు బాబర్ నిలిచినా.. మరోసారి దూకుడుగా ఆడడంలో విఫలమయ్యాడు. 11వ ఓవర్లో ఓవర్టన్ బౌలింగ్‌లో అతడు బౌల్డయ్యే సమయానికి పాకిస్థాన్ స్కోరు 73 మాత్రమే. ఫర్హాన్‌తో మూడో వికెట్‌కు అతడు 7.2 ఓవర్లలో 46 పరుగులు మాత్రమే జోడించాడు. అయితే ఫకార్ జమాన్ వచ్చాక ఇన్నింగ్స్‌కు ఊపొచ్చింది. అతడు వస్తూనే.. జాక్స్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. ఫర్హాన్ కూడా జోరందుకున్నాడు. జాక్స్ బౌలింగ్‌లో బ్యాటర్లిద్దరూ చెరో సిక్స్ బాదేశారు. 16వ ఓవర్లో ఫర్హాన్ వరుసగా 6, 4 కొట్టాడు. అయితే అదే ఓవర్లో ఫర్హాన్, తర్వాతి ఓవర్లో జమాన్ వెనుదిరిగారు. 30 బంతుల్లోనే 49 పరుగులు జోడించిన బ్యాటర్లు వెంటవెంటనే నిష్క్రమించడంతో ఇన్నింగ్స్ నెమ్మదించింది. పాక్ ఆఖరి మూడు ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 24 పరుగులు మాత్రమే చేసింది. డాసన్ ఆర్చర్, సామ్ కరన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. టీ20 ప్రపంచకప్‌లో చాలా ముందుగానే ఒక సెమీస్ బెర్తు ఖరారైపోయింది. గ్రూప్–2 నుంచి ఇంగ్లాండ్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆ జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి 4 పాయింట్లు సాధించింది. గ్రూప్‌లో మరో జట్టుకు మాత్రమే 4 అంతకంటే ఎక్కువ పాయింట్లు సాధించే అవకాశం ఉండడంతో ఇంగ్లాండ్ ముందంజ వేసింది. ఆ జట్టు తన చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఇంగ్లాండ్ కనీసం రెండో స్థానంలో నిలుస్తుంది. గెలిస్తే అగ్రస్థానం సాధిస్తుంది. బుధవారం న్యూజిలాండ్, శ్రీలంక తలపడనున్నాయి. ఇందులో లంక నెగ్గితే దాంతో పాటు కివీస్, పాక్ కూడా పోటీలో ఉంటాయి.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com